ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
గురువారం 24 జూలై 2025



శుభాల.. శ్రావణం



- రేపటి నుంచి శ్రావణ మాసం ప్రారంభం
- పండుగలకు 'నెల'వు.. మహిళలకు ప్రీతిపాత్రం

8



శుభకార్యాలకు నెలవైన శ్రావణమాసం ఈనెల 25న ఆరంభం కానుంది. ప్రతి ఇల్లు ఓ ఆలయంగా మారి.. ఉదయం, సాయంత్రం వేళల్లో భగవన్నామస్మరణతో మార్మోగనుంది. మరో వైపు పెళ్లి బాజాలు ఘనంగా మోగనున్నాయి. ఈ పండుగను పురస్కరించుకుని జిల్లాలోని ఆలయాలను అధికారులు, కమిటీ సభ్యులు ముస్తాబు చేస్తున్నారు. సామూహిక వరలక్ష్మీవ్రతాలు, పవిత్రోత్సవాలు, కృష్ణాష్టమి వేడుకలు, రాఖీ పౌర్ణమి వరుసగా జరుగనున్నాయి. ఆషాఢం వీడి శ్రావణం మొదలు కానుండడంతో వ్యాపారులు, రైతులు కొత్త ఆశలు పెట్టుకున్నారు.

మట్టి పరీక్షలు 38.72 శాతమే..

- లక్ష్యంపై వ్యవసాయ శాఖ నిర్లక్ష్యం
- ఖరీఫ్ సాగు మొదలైనా తేలని భూసారం
- వెంటాడుతున్న సిబ్బంది, రసాయనాల కొరత
- భూ ఆరోగ్య కార్డుల కోసం రైతుల ఎదురుచూపు

మందకొడిగా సాగుతున్న వైనం



భూమి ఆరోగ్యంపైనే సాగు.. దిగుబడులు ఆధారపడి ఉంటాయి. ఇంతటి ప్రధానమైన మట్టి పరీక్షలపై ప్రభుత్వం పట్టుదలగా ఉంది. రైతులకు ఎంతో మేలు చేకూర్చే ఈ మట్టి పరీక్షలపై వ్యవసాయ శాఖ నిర్లక్ష్యం వహిస్తోంది. ఖరీఫ్ సాగు మొదలైనా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో కేవలం 38.72 శాతం మాత్రమే మట్టి పరీక్షలు జరిగాయంటే వ్యవసాయశాఖ శ్రద్ధ తెలుస్తోంది. భూసారం తేల్చేందుకు పెద్ద ఎత్తున పరీక్షలు చేయాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించగా వాటిని చేరుకోవడంలో వ్యవసాయ శాఖ చతికిల పడింది. మట్టి నమూనాలను లక్ష్యాల మేర సేకరించడంతో సరిపెట్టిన వ్యవసాయశాఖ పరీక్షలపై దృష్టి సారించడం లేదు. అదేమంటే సిబ్బంది.. రసాయనాలు.. పరికరాల కొరత ఉందని అందువల్లే పరీక్షలు ఆశించిన మేర చేయలేకపోతున్నట్లు అధికారులు చెప్తున్నారు. 38.72 శాతం పరీక్షలకు సంబంధించిన పుడమి ఆరోగ్య కార్డులు పంపిణీ ఇప్పటికీ చేయలేదని రైతులు వాపోతున్నారు.



మట్టి నమూనాల పరీక్షలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మూడు నెలలుగా భూసార పరీక్షలు మందకొడిగా సాగుతున్నాయి. ఇప్పట్లో ఆ పరీక్షలు పూర్తయ్యే పరిస్థితులు కానరావడం లేదు. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల పరిధిలో 60,124 మట్టి నమూనాల పరీక్షల లక్ష్యం కాగా ఇప్పటికి 23,284 నమూనాల పరీక్షలు మాత్రమే పూర్తి చేశారు. లక్ష్యాలు ఇచ్చిన ప్రభుత్వం క్షేత్రస్థాయిలో వసతులు కల్పించడాన్ని విస్మరించింది. భూసార పరీక్షలు యజ్ఞంలా చేయాలని నిర్ణయించినా ఆచరణలో వ్యవసాయశాఖ విఫలమైంది. భూమిలో సారం ఎంత ఉందో మట్టి పరీక్షల ద్వారా నిర్ధారిస్తారు. ఈ పరీక్షల ఆధారంగా సారాన్ని నిర్ధారించి ఏ పంటలు సాగు చేస్తే మంచి దిగుబడులు పొందవచ్చో రైతులు (మిగతా 6వ పేజీలో)

స్థిరాస్తి అక్రమ లేఅవుట్లపై చర్యలు

- విద్యుత్ కనెక్షన్లు.. రిజిస్ట్రేషన్ నిలుపుదల
- పుడా ఉపాధ్యక్షుడు సూరజ్

నరసరావుపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లాలో స్థిరాస్తి అక్రమ లే అవుట్‌లపై చర్యలు తీసుకుంటున్నామని పుడా ఉపాధ్యక్షుడు, జేసీ సూరజ్ ధనుంజయ్ బుధవారం తెలిపారు. పుడా.. ప్రేక్షకపాత్ర అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వెలువడిన వార్తపై ఆయన స్పందించారు. 55 లేఅవుట్‌లను గుర్తించిన సబంధితులకు నోటీసులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జారీ చేడంతో పాటు ఇది అక్రమ లే అవుట్‌ని బోర్డులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మరో 14 అక్రమ లేఅవుట్‌లను గుర్తించి చర్యలకు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించామన్నారు. అనధికార లేఅవుట్‌లకు విద్యుత్ కనెక్షన్లు, రిజిస్ట్రేషన్‌లు నిలుపుదలకు సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్టు చెప్పారు. అప్రూవల్ తీసుకొని లేఅవుట్‌లపై చట్టరీత్యా చర్యలు తీసుకోనున్నట్టు పేర్కొన్నారు. పుడాలో పనిచేసేందుకు ఈఈ, ఎఈలను పబ్లిక్ హెల్త్ శాఖ నుంచి డిప్యూటేషన్‌పై నియమించాలని సదరు శాఖ ఈఎన్‌సీని కోరగా వారి నియమించడం జరిగిందన్నారు.

గుంతల రహదారి



రహదారిపై ఏర్పడిన భారీ గుంతలు



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నరసరావుపేట వల్లప చెరువు నుంచి అగ్రహారం, రూపెనగుంట్ల రహదారులు గుంతల మయంగా మారాయి. భారీ గుంతలు ఏర్పడటంతో వహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఈ రహదారుల్లో ప్రయాణం ప్రాణసంకటంగా మారింది. ఇసుక.. గ్రావెల్ ఓవర్ లోడు లారీలతో రహదారులు ధ్వంస మయ్యాయి. గుంతలు లేని రహదారులను రూపొందిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా స్థానిక అధికారులకు మాత్రం గుంతల రహదారులు కనిపించకపోవడం గమనార్హం. ప్రభుత్వం చెబుతున్నట్టుగా రహదారిపై గుంతలు పూడ్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అప్పగింతకు.. ఆపసోపాలు

నరసరావుపేటలో పాడుబడుతున్న టిడ్కో గృహాలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నరసరావుపేటలో టిడ్కో గృహాల పంపిణీకి అధికారులు ఆపసోపాలు పడుతున్నారు. అప్పులు చేసి మరీ వాటా ధనం చెల్లించిన లబ్ధిదారులు ఇంటి కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. కొందరైతే బ్యాంకు ఈఎంఐ కూడా చెల్లిస్తున్నారు. టీడీపీ హయాంలో 1504 టిడ్కో గృహాలను నిర్మించి లబ్ధిదారులకు కేటాయించారు. వైసీపీ అధికారంలోకి రావడంతో గృహాలను లబ్ధిదారులకు అప్పగించలేదు. రూ.50 వేలు చెల్లించిన లబ్ధిదారులు పేర్లను అర్హుల జాబితాలో నుంచి తొలగించి రూ.25 వేలు వాటా ధనం స్వీకరించి వేరొకరికి కేటాయించింది. దీంతో పేర్లు తొలగించిన లబ్ధిదారులు కోర్టును ఆశ్రయించడంతో తిరిగి వారికే ఇళ్లను కేటాయించాలని కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. ఉన్నది 1504 గృహాలు అయితే వాటా ధనం చెల్లించిన లబ్ధిదారులు 1820 పైగా ఉన్నట్లు టిడ్కో లెక్కలు తెలియజేస్తున్నాయి. ఉన్న ఇళ్లకు, లబ్ధిదారుల సంఖ్యకు మధ్య వ్యత్యాసం పెరిగిపోయింది. దీంతో ఇళ్ల పంపిణీకి బ్రేక్ పడింది. దీంతో అన్ని వసతులు ఉన్న 976 ఇళ్లు పాడుబెట్టారు. ఇల్లు ఇవ్వకుంటే చెల్లించిన వాటా ధనం తిరిగి ఇవ్వాలని లబ్ధిదారులు కోరుతున్నా వారి గోడు పాలకులకు పట్టించుకోవడం లేదు.



టిడ్కో గృహాల వద్ద దట్టంగా పెరిగిన కంప చెట్లు

మామూళ్లతో మాయ

- అవలీలగా నకిలీ రిజిస్ట్రేషన్లు
- ఆ విశ్రాంత జాయింట్ రిజిస్ట్రార్‌పై ఆరోపణలు
- రూ.40 కోట్ల ఆస్తికి రిజిస్ట్రేషన్‌పై నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లో కేసు




గుంటూరు సిటీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఒకరి పేరు నుంచి మరొకరి పేరుపై ఆస్తి మార్చాలంటే కట్టిదిట్టమైన పద్ధతి ఉంది. అయితే ఈ పద్ధతికి స్వస్తి పలుకుతూ మామూళ్లతో రిజిస్ట్రేషన్లు చేసేస్తున్నారు. గుంటూరు సమీపంలోని గోరంట్ల పరిధిలోని రూ.40 కోట్ల ఆస్తి రిజిస్ట్రేషనే ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. భారీగా ముడుపులు చేతులు మారినట్లు తెలుస్తుంది. కొద్దినెలల క్రితం ఉద్యోగ విరమణ పొందిన నరసరావుపేట జాయింట్ రిజిస్ట్రార్ ముందుగానే అన్నీ మాట్లాడుకుని నకిలీ రిజిస్ట్రేషన్‌కు శ్రీకారం చుట్టినట్లు తెలుస్తుంది. ప్రస్తుతం నల్లపాడు పోలీసుల అదుపులో ఉన్న కీలక నిందితుడు అక్రమ రిజిస్ట్రేషన్ గుట్టు విప్పినట్లు తెలుస్తుంది. నకిలీ దస్తావేజులు చేయడం ఆ విశ్రాంత జాయింట్ రిజిస్ట్రార్‌కు వెన్నతో పెట్టిన విద్య అని పలువురు చెప్తున్నారు. ఇతడే గుంటూరులో పని చేసిన సమయంలో మానస సరోవరాన్ని కూడా పలువురికి రిజిస్ట్రేషన్ చేసినట్లు సమాచారం. కలెక్టర్ జోక్యంతో సదరు దస్తావేజులు రద్దు చేసినట్లు తెలిసింది. పిడుగురాళ్ల, ఒంగోలు, నెల్లూరు తదితర ప్రాంతాల్లో పనిచేసిన సమయంలో కొన్ని వందల నకిలీ రిజిస్ట్రేషన్లు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒంగోలులో జరిగిన నకిలీ చలానాల కుంభకోణంలో కూడా ఆయన పాత్ర ఉన్నట్లు చెబుతున్నారు. అన్ని తప్పులు చేసినా కొందరు అధికారులు ఆయనను వెనకేసుకు రావడం వల్ల ఇటువంటి వ్యవహారాలు పదే పదే జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. గుంటూరులోని గోరంట్లలో రూ.40 కోట్ల ఆస్తి రిజిస్ట్రేషన్ వ్యవహారంలో ఇదే జాయింట్ రిజిస్ట్రార్ భారీగా నగదు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో ఓ సీనియర్ అసిస్టెంట్‌తోనే 18 జీపీఏ చేయించినట్లు తెలుస్తుంది. ప్రస్తుతం పల్నాడులో ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా ఉన్న ఆ సీనియర్ అసిస్టెంట్‌పై కూడా కేసు నమోదు చేయాలని బాధితులు పోలీసులను కోరినట్లు తెలుస్తుంది. ఇప్పటికే నల్లపాడు పోలీసులు నరసరావుపేటలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన జాయింట్ రిజిస్ట్రార్, గుంటూరుకు చెందిన మరో రిజిస్ట్రార్‌పై కేసు నమోదు చేశారు.

డీఐజీ జోక్యంతో..

రూ.40 కోట్ల ఆస్తికి నకిలీ రిజిస్ట్రేషన్‌పై బాధితుడు కొత్తపల్లి శ్రీనివాసరావు అప్పట్లో నరసరావుపేట వెళ్లి అధికారులను సంప్రదించినా పట్టించుకోలేదు. దీంతో బాధితుడు స్టాంప్స్, రిజిస్ట్రేషన్ గుంటూరు డీఐజీకి ఫిర్యాదు చేయడంతో నరసరావుపేట మాజీ జాయింట్ రిజిస్ట్రార్ హడావిడిగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి అప్పట్లో నకిలీ రిజిస్ట్రేషన్‌పై ఫిర్యాదు చేశారు.

నకిలీ మనిషిని తెచ్చినా ఓకే..

వాస్తవానికి రూ.40 కోట్ల ఆస్తికి సంబంధించిన అసలు వ్యక్తి కొత్తపల్లి పద్మజ మృతి చెందారు. ఆమె ఆధార్ కార్డు ఆధారంగానే ఆస్తి బదలాయింపు జరగాలి. రిజిస్ట్రేషన్ సమయంలో అసలు యజమాని వేలిముద్రలు కూడా సరిపోలాలి. మామూళ్ల మత్తులో ఉన్న నరసరావుపేట విశ్రాంత జాయింట్ రిజిస్ట్రార్ అన్నిటినీ తేలికగా మార్చేశారు. ఇష్టానుసారంగా వ్యవహరించి అసలు ఆస్తి పరులను వివాదంలోకి నెట్టారు. ఎనీవేర్ రిజిస్ట్రేషన్లకు కొరిటపాడులో అనుమతి ఇచ్చారని సమాచారం.



కాల్వకు విడుదలవుతున్న నీరు

కుడి కాల్వకు సాగునీరు

- సాగర్ జలాశయం నుంచి విడుదల
- నీటి విడుదలతో అన్నదాతల్లో హర్షం
- 500 క్యూసెక్కులను క్రమేణా పెంపుదల
- వరద పోటెత్తుతుండటంతో ముందస్తు విడుదల

(నరసరావుపేట, మాచర్ల రూరల్, ఆంధ్రజ్యోతి)

భారీగా వరద పోటెత్తుతుండటంతో నాగార్జున సాగర్ జలాశయంలో నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరింది. ఈ నేపథ్యంలో సాగర్ జవహర్ కుడి కాల్వకు జలవనరుల శాఖ బుధవారం సాయంత్రం 6 గంటలకు సాగుకు 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేసింది. ఈ కార్యక్రమంలో ఏఈలు భారతి, సుధా, అనిత, రమణ పాల్గొన్నారు. క్రమేపి నీటి విడుదలను 6,000 క్యూసెక్కులకు పెంచనున్నారు. గత ఏడేళ్లలో జూలైలో సాగునీటిని విడుదల చేయడం ఇదే ప్రథమం. నీటి విడుదలతో రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. నీటి వనరుల కింద ఇప్పటికే రైతులు వరి నారుమళ్ల సాగు చేపట్టారు. ఈ వారంలో సాగు ముమ్మరం కానున్నది. నీటి విడుదలతో వరి విత్తనాల కొరత లేకుండా వ్యవసాయశాఖ చర్యలు చేపట్టాల్సి ఉంది. ఇప్పటివరకు రాయితీ వరి విత్తనం పంపిణీని ప్రారంభించలేదు.

పెరిగిన వరద ప్రవాహం..

సాగర్ జలాశయానికి బుధవారం వరద ప్రవాహం పెరిగింది. 1,21,967 క్యూసెక్కుల వరద వస్తుంది. శ్రీశైలానికి వరద పెరగడంతో సాగర్ జలాశయంలో కూడా నీటి మట్టం పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కుడి కాల్వకు నీటిని విడుదల చేశారు. విద్యుత్ ఉత్పత్తి 3374, కుడి కాల్వకు 500, ఎస్ఎల్‌బీసీకి 1800, ఎడమ కాల్వకు 3000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయం గరిష్ఠ నీటి నిల్వ 312.04 టీఎంసీలు కాగా బుధవారం సాయంత్రానికి 264.10 టీఎంసీలకు(573 అడుగులు) చేరింది.

998 ఆలయాలకు రూ.772 కోట్లు

- ఆలయాల పునః నిర్మాణాలకు చర్యలు
- కోటప్పకొండ ఆలయ అప్పు రూ.57 లక్షలు రద్దు
- దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

నరసరావుపేట టౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా 998 ఆలయాల పునః నిర్మాణం కోసం రూ.772 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసినట్లు దేవదాయశాఖ మంత్రి ఆనం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

రామనారాయణరెడ్డి తెలిపారు. నరసరావుపేట పట్టాభిరామస్వామి ఆలయంలోని వేంకటేశ్వర కల్యాణ మండపంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో మంత్రికి టీటీడీ వేద పాఠశాల పండితులు, త్రికోటేశ్వరస్వామి, ఇసప్పాలెం మహంకాళి అమ్మవారి ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటప్పకొండ ఆలయ అప్పు రూ.57 లక్షలు రద్దు చేసినట్లు ప్రకటించారు. ఈవో కార్యాలయానికి రూ.20 లక్షలు, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.32 లక్షలు మంజూరు చేశామన్నారు. రాష్ట్రంలో ప్రతి ఆలయంలో ఓంకార నామం ప్రతిధ్వనించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వాసవి కన్యాకా పరమేశ్వరి నిర్వాణం ప్రభుత్వమే అధికారికంగా నిర్వహిస్తుందన్నారు. రాష్ట్రంలో 5523 చిన్న ఆలయాల్లో దూప, దీప, నైవేద్యం కోసం రూ.10 వేల చొప్పున రూ.66.27 కోట్లు మంజూరు చేశామన్నారు. వైసీపీ ప్రభుత్వం రూ.10.50 లక్షల కోట్లు అప్పులతో రాష్ట్రాన్ని ముంచిందన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ఐదేళ్ల దుర్మార్గపాలనలో భ్రష్టు పట్టిన వ్యవస్థలను గాడిలో పడి రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ఉండాలంటే కూటమి ప్రభుత్వం ఉండాలన్నారు. చంద్రబాబు ఐదోసారి ముఖ్యమంత్రి అవుతారని, తాను నరసరావుపేటలో మళ్లీ ఎమ్మెల్యేగా విజయం సాధిస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, బులియన్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, జమీందారు రామకృష్ణ కొండలరావు బహదూర్, ఆర్డీవో మధులత, తహసీల్దారు వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు వాహనయోగం

- ఉచితంగా ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం
- తొలిదశలో నియోజకవర్గానికి పది చొప్పున పంపిణీ
- త్వరలోనే దరఖాస్తుల స్వీకరణ

ఇంజనీరింగ్ సీట్ల జాబితా విడుదల

- ఉమ్మడి జిల్లాలో 30 వేలకు పైగా సీట్లు
- 26 లోపు రిపోర్టు చేయాలని ఉత్తర్వులు

8

15 లోపు సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

● సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు



మాట్లాడుతున్న ఏవీ నాగేశ్వరరావు, వేదికపై సీఐటీయూ నాయకులు

గుంటూరు(తూర్పు), జూలై 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15లోపు సంక్షేమ బోర్డును పునరుద్ధరించకపోతే ఎమ్మెల్యేలను అడ్డుకుంటామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు హెచ్చరించారు. పాత గుంటూరు, శ్రీకృష్ణ కళ్యాణ మండపంలో రెండు రోజులు పాటు జరిగే భవన నిర్మాణ కార్మికుల సంఘ రాష్ట్ర మహాసభలను బుధవారం ఆయన ప్రారంభించి ప్రసంగించారు. ఎన్నికల్లో భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాల పేరుతో ఇచ్చే కన్నా ప్రజల నుంచి పన్నుల పేరుతో వసూలు చేసేది ఎక్కువైందన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వీ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం అనుస రిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను కార్మికవర్గం చైతన్యంతో తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. సంఘ రాష్ట్ర కార్యదర్శి ఆర్‌వీ నరసింహారావు, మహిళా రాష్ట్ర నాయకులు దయారామాదేవి ప్రసంగించారు. తొలుత సీఐటీయూ జెండాను వి ఉమామహేశ్వరరావు ఆవిష్కరించారు. మహాసభకు రమణారావు అధ్యక్షత వహించగా, సభలో సీఐటీయూ నాయకులు, పలు జిల్లాలకు చెందిన కార్మికులు పాల్గొన్నారు.

కోల్డ్‌స్టోరేజి బాధిత రైతులకు చెక్కుల పంపిణీ



రైతుల బీమా పత్రాలను తనిఖీ చేస్తున్న దుగ్గిరాల యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి జేవీ సుబ్బారావు

దుగ్గిరాల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల కోల్డ్‌స్టోరేజి అగ్నిప్రమాద బాధిత రైతుల ఖాతాల్లో నగదు జమ ప్రక్రియ బుధవారం కొనసాగింది. పంటబీమా నగదు కింద చెక్కుల పంపిణీలో భాగంగా దుగ్గిరాల మార్కెట్‌యార్డులో సోమవారం ప్రారంభం కాగా, రెండ్రోజుల పాటు తెనాలి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో చెక్కులను పంపిణీ చేశారు. బీమాసంస్థ నుంచి వచ్చిన జాబితా ప్రకారం 346 మందికి బీమా మొత్తం అందించాల్సి ఉంది. వీరిలో 332 మంది రైతులు, 14 మంది వ్యాపారులు ఉన్నారు. మొత్తం రూ.22.50కోట్లు మంజూరు కాగా వ్యాపారులకు చెందిన 42 బాండ్లకు సంబంధించి రూ.2.76కోట్లు మంజూరు చేశారు. దుగ్గిరాల ఏఎంసీ, తెనాలి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో మూడ్రోజుల్లో 308 మంది ఖాతాల్లో రూ.19.5కోట్లు నగదు జమచేశారు. మిగిలిన 24 బాండ్లకు సంబంధించి నగదు చెక్కులను పంపిణీ చేయాల్సి ఉందని, వారికి ఫోన్‌ద్వారా సమాచారం అందించగా, అందుబాటులో లేమని కొందరు చెప్పారన్నారు. వారందరి ఖాతాల్లో నగదు జమపై ఉన్నతాధికారుల ఆదేశాను సారం నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని కార్యదర్శి సుబ్బారావు తెలిపారు.

పేదల జీవనప్రమాణాలు పెంచడమే..

పీ-4 ముఖ్య ఉద్దేశం

పోస్టర్ల ఆవిష్కరణలో మంత్రి మనోహర్



సచివాలయంలో అధికారులతో మాట్లాడుతున్న మంత్రి మనోహర్

తెనాలి రూరల్, జూలై23(ఆంధ్రజ్యోతి):పేదల జీవనప్రమాణాలను పెంచేందుకే కూటమి ప్రభుత్వం పీ-4 కార్యక్రమాన్ని చేపట్టిందని, 2029 నాటికి 50లక్షల పేద కుటుంబాలు అభివృద్ధివైపు నడిపించడమే లక్ష్యంగా ముందుకు సాగుతుందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. అమరావతి సచివాలయంలో బుధవారం మంత్రి మనోహర్ తెనాలి విజన్‌యాక్షన్ ప్లాన్‌పై నియోజవర్గ అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక మంది పేదలు తరాలు మారుతున్నా అందులోనే మగ్గుతున్నారని చెప్పారు. అటువంటి కుటుంబాలను సైతం ఆర్థికంగా నిలదొక్కుకుని అభివృద్ధిలోకి వచ్చేలా పీ-4 (పబ్లిక్ - పీపుల్ - ప్రైవేట్ - పార్టనర్‌షిప్) ప్రోగ్రాంను చేపట్టడం జరిగిందన్నారు. తెనాలి ప్రాంతంలో ఉన్న పేదలను గుర్తించి పీ-4లో భాగస్వాములను చేసేందుకు ఇప్పటికే అధికారయంత్రాంగం నడుంబిగించిందన్నారు. తెనాలి నియోజవర్గంలో సుమారు 14280 (పేదలు) బంగారు కుటుంబాలను గుర్తించినట్లు తెలిపారు. వారికి అండగా నిలిచేందుకు 376మంది ముందుకు వచ్చారన్నారు. వీరు దాదాపు 3289మందిని దత్తత తీసుకోనున్నట్లు తెలియజేశారు. డేటా వెరిఫికేషన్ అనంతరం వీరి సహాయంతో వారి అభివృద్ధికి అవసరమైనవిధంగా ఉపాధి పొందేందుకు, చదువులకు తోడ్పాటు, వ్యవసాయ సాగుకు, మార్కెటింగ్, బ్యాంక్ రుణాలు ఇప్పించడం, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారికి వైద్య సహాయం తదితర విషయాల్లో చేయూతనందించడం జరుగుతుందన్నారు. త్వరలోనే మార్గదర్శకులను పరిచయం చేసేలా కార్యక్రమాన్ని తెనాలిలో నిర్వహించనున్నట్లు మంత్రి మనోహర్ వెల్లడించారు. ఈ యాక్షన్ ప్లాన్ తెనాలి నియోజకవర్గానికి ఒక రోల్‌మోడల్‌గా మారుతుందన్నారు. ఎన్నారైలు, ఇతర ప్రాంతాల్లో ఉన్న తెనాలి వాసుల సహకారం తీసుకుంటూ వారిని భాగస్వాములుగా మార్చే ప్రణాళిక చేపడుతున్నట్లు తెలిపారు. తొలుత పీ-4 వాల్ పోస్టర్లను అధికారులతో కలిసి మంత్రి మనోహర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ సంజనసింహ, తహసీల్దార్ గోపాలకృష్ణ, ఎంపీడీవోలు అత్తోట దీప్తి, విజయలక్ష్మి, మునిసిపల్ ఇన్‌ఛార్జ్ కమిషనర్ లక్ష్మీపతిరావు, స్వర్ణాంధ్రవిజన్ మేనేజ్‌మెంట్ యూనిట్ అధికారులు, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

అగ్రి వర్సిటీ స్నాతకోత్సవం నేడు

ఎన్‌జీ రంగా యూనివర్సిటీ వీసీ శారదా జయలక్ష్మీదేవి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వీసీ శారదా జయలక్ష్మీదేవి

లాంఫాం(తాడికొండ), జూలై 23(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 57వ స్నాతకోత్సవం వేడుకలను గన్నవరం మండలం ఆత్కూర్ గ్రామంలోని స్వర్ణభారతి ట్రస్ట్‌లో గురువారం నిర్వహించనున్నట్లు వీసీ డాక్టర్ ఆర్ శారదా జయలక్ష్మీదేవి పేర్కొన్నారు. బుధవారం ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో విలేకర్ల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ స్నాతకోత్సవానికి రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ పాల్గొంటారని తెలిపారు. విశ్వవిద్యాలయం పూర్వవిద్యార్థి అయిన మాజీ ఐఏఎస్ ఏ వేణుప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. 2023-24 సంవత్సరంలో 1419 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని, 1995 మంది విద్యార్థులు వివిధ కోర్సులలో చేరారని తెలిపారు. డిప్లొమాలో 2023-24లో 1016 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారన్నారు. పీజీ కోర్సులో 196 మంది, పీహెచ్‌డీలో 46 మంది విద్యార్థులు స్నాతకోత్సవంలో పట్టాలు పొందేందుకు అర్హత సాధించారన్నారు. స్నాతకోత్సవంలో వ్యవసాయ పరిశోధనల్లో అత్యుత్తమ ప్రతిభకు రెండు జాతీయ అవార్డులను ఇస్తున్నట్లు తెలిపారు. సాంబమసూరు బియ్యం రకాన్ని కనుగొన్న డాక్టర్ ఎంవీ రెడ్డి, స్వర్ణ రకాన్ని కనుగొన్న వీ రామచంద్రరావు పేర్ల మీద జాతీయస్థాయిలో అవార్డులు ఇస్తున్నట్లు తెలిపారు. ఆచార్య ఎన్‌జీ రంగా పేరుమీద యువ శాస్త్రవేత్త పురస్కారాన్ని ఇస్తున్నట్లు తెలిపారు. యోగ్య ఉపాధ్యాయ పురస్కార గ్రహీత అవార్డులు 4, యోగ్య పరిశోధనా పురస్కార గ్రహీతలు 3, యోగ్య విస్తరణ పురస్కార గ్రహీత అవార్డులు 2 ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ శ్రేణులపై వైసీపీ కార్యకర్తల దాడి

ఇద్దరికి తీవ్ర గాయాలు





చికిత్స పొందుతున్న టీడీపీ కార్యకర్తలు నంబుల కాట్రాజు, మాగంటి బాబూరావు

సత్తెనపల్లి రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కార్యకర్తలపై వైసీపీ కార్యకర్తలు దాడి చేసి గాయపరిచిన సంఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలంలోని రెంటపాళ్ళలో మంగళవారం రాత్రి జరిగింది. బాధితుల కథనం మేరకు మాగంటి బాబూరావు తన గొర్రెలతో పాటు తన బంధువులకు చెందిన గొర్రెలను పొలంకు తోలుకు వెళ్ళి సాయంత్రం కావటంతో ఇంటికి తోలుకొని వస్తున్నాడు. మార్గ మధ్యలోకి వచ్చే సరికే వర్షం కురవటంతో పక్కన పొలాల్లో(దుక్కిలో) నిలుపి వేశాడు. ఈ సమయంలో గ్రామానికి చెందిన వల్లెపు రాంబాబు తన మిరప నారు మడుల వద్దకు వెళ్తూ గొర్రెలు ఇక్కడ ఎందుకు ఆపావు?, పక్కన మిరప నారు మడులు ఉన్నాయి, తొందరగా తోలుకు వెళ్ళు అని హెచ్చరించాడు. రాంబాబు నారు మడి వద్ద నుంచి తిరిగి వచ్చే సరికే గొర్రెలు అక్కడే ఉండటంతో నిన్ను గొర్రెలు తోలుకు వెళ్ళమంటే ఇక్కడే ఉంచావేంటంటూ తనను గొంతు పట్టుకొని నెట్టాడని బాబూరావు విలేకరులకు తెలిపారు. ఈ సమయంలో ఇరువురు ఒకరికొకరు నెట్టుకున్నారు. ఈ క్రమంలో నువ్వు ఊళ్ళోకి వస్తావో చూస్తానని బాబూరావును రాంబాబు హెచ్చరించాడు. ఈ క్రమంలో వల్లెపు వీరయ్య, రవితేజ, మరికొందరిని తీసుకొని గొర్రెలు తోలుకు వస్తున్న బాబూరావు వద్దకు వెళ్ళి ఘర్షణ పడ్డాడు. బాబూరావు తరపు వారు కూడా రావటంతో రాంబాబు, అతని వర్గీయులు బాబూరావు, నంబుల కాట్రరాజు, మరికొందరిపై కర్రలు, గొడ్డళ్ళతో దాడి చేశారు. ఈ ఘటనలో బాబూరావు, కాట్రరాజు తలలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం బంధువులు సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. తాము టీడీపీకి చెందిన వారమనే గొర్రెలు నారు మడిలో పడక పోయినా తమపై దాడి చేసి కొట్టారని బాబూరావు ఆరోపించారు. ఈ ఘర్షణలో వైసీపీకి చెందిన ఇద్దరికి కూడా స్వల్ప గాయాలైనట్టు సమాచారం. ఈ విషయంపై ఇరు వర్గీయులు సత్తెనపల్లి రూరల్ పోలీసు స్టేషన్‌లో పరస్పర ఫిర్యాదులు చేసుకున్నారు. వల్లెపు రాంబాబు ఫిర్యాదు పై మాగంటి బాబురావు మరో ముగ్గురిపై, మాగంటి బాబూరావు ఫిర్యాదు మేరకు వల్లెపు రాంబాబు, మరో ఇద్దరి పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ పోలీసులు బుధవారం తెలిపారు.

తాళంవేసి ఉన్న ఇంట్లో చోరీ

రూ.56వేల నగదు, 200గ్రాముల వెండి అపహరణ



చోరీ జరిగిన ఇంట్లో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం

యడ్లపాడు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. యడ్లపాడు మండలం సొలస గ్రామంలో జరిగిన ఈ ఘటనలో రూ.56వేల నగదు, 200గ్రాముల వెండి వస్తువులు చోరీకి గురయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సొలస గ్రామానికి చెందిన కిలారు వెంకటేశ్వరరావు, హనుమాయమ్మ దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. కుమార్తె అరుణ గ్రామంలోనే పక్క వీధిలో నివాసం ఉంటుండగా ఆమె కుమార్తె, కుమారుడు హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఈ నెల 5వ తేదీన వెంకటేశ్వరరావు దంపతులు మనుమరాలిని, మనుమడిని చూసేందుకు హైదరాబాద్ వెళ్లారు. కాగా బుధవారం ఉదయం ఇంటి గేటు తెరచి ఉండడాన్ని గమనించిన పొరుగునే నివాసం ఉంటున్న నార్నె అన్నపూర్ణమ్మ గ్రామంలోనే ఉంటున్న కుమార్తె అరుణకు సమాచారం అందించింది. వెంటనే అక్కడకు చేరుకున్న అరుణ గేటు తాళంతో పాటు ప్రధాన ద్వారం తాళం పగులగొట్టి ఉండడాన్ని గమనించి ఇంట్లోకి వెళ్ళి పరిశీలించింది. ఇంట్లోని ఇనుప బీరువా పగులగొట్టి ఉండడంతోపాటు వస్తువులన్నీ చిందరవందరగా నేలపై పడవేసి ఉన్నాయి. దీనితో చోరీ జరిగినట్లు గుర్తించి హైదరాబాద్‌లో ఉన్న తల్లిదండ్రులకు ఫోన్‌చేసి చెప్పింది. కంగారుపడిన తల్లిదండ్రులు ఇటీవల బ్యాంకు నుంచి వ్యవసాయ రుణం రూ.1.10లక్షలు తీసుకున్నానని, వాటిలో ఖర్చులు పోను మిగిలిన రూ.56వేలు బీరువాలో ఉంచి హైదరాబాద్ వచ్చామని, అంతేగాకుండా 200గ్రాముల వెండి వస్తువులు కూడా ఉన్నాయని తెలిపారు. దీనితో కుమార్తె పోలీసులకు సమాచారం అందించగా ఎస్‌ఐ శివరామకృష్ణ సిబ్బందితో కలసి గ్రామానికి చేరుకుని చోరీ జరిగిన ఇంటిని, పరిసరాలను పరిశీలించారు. క్లూస్‌టీంను రప్పించి ఆధారాలను సేకరించారు. అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రాణాలమీదకు తెచ్చిన ప్లాస్టిక్ డబ్బా

● డ్రెయినేజీలో ఇరుక్కున బాలుడు ● రక్షించిన మున్సిపల్ సిబ్బంది



ప్రాణాలతో బయట పడ్డ తుపాకుల రాంబాబు

వినుకొండటౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పాత ప్లాస్టిక్ డబ్బాల కోసం వెళ్లి డ్రెయినేజీ పైపులో ఓ బాలుడు ఇరుక్కున్న సంఘటన పట్టణంలోని నరసరావు పేట రోడ్డులో గల గంగినేని కల్యాణ మండపం సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలను పరిశీలిస్తే... డ్రైవర్ కాలనీలో నివాసం ఉంటున్న తుపాకుల వెంకటేశ్వర్లు, కృష్ణవేణిలకు ఆరుగురు సంతానం. ఐదుగురు మగ సంతానం కాగా ఒక కుమార్తె కలదు. చివరి సంతానంగా జన్మించిన తుపాకుల రాంబాబు తోటి స్నేహితులైన అంకయ్య, మహంకాళి, అంకమ్మరావులతో కలిసి పాత డబ్బాలను ఏరుకునేందుకు డ్రైనేజీ వద్దకు చేరుకున్నారు. డ్రైనేజీ పైపులో పేరుకుపోయిన డబ్బాలను వెలికితీస్తూ ముందుకు సాగుతూ పైపులో అతను ఇరుక్కుపోయాడు. ఇదే సమయంలో మురుగునీరు పైపులోకి ప్రవేశించడంతో ఊపిరాడక కేకలు వేశాడు. దీంతో సమీపంలోని స్నేహితులు రోడ్డుపై వెళ్లే వాహనదారులకు సమాచారం చేరవేడయంతో వారంతా పైపువద్దకు వెళ్లి బాలుడిని వెలికితీసేందుకు ప్రయత్నించాడు. సుమారు గంట సేపు బాలుడిని వెలికితీసేం దుకు తీవ్ర ప్రయత్నం చేశారు. సమాచారం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్‌తో కలసి సంఘటనా ప్రాంతా నికి చేరుకొని డ్రెయినేజీ పైపును చాకచక్యంగా పగలగొట్టి బాలుడిని వెలికితీసి వైద్యం నిమిత్తం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు ప్రా ణాపాయం లేదని తెలపడంతో ఊపిరిపీల్చుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో ప్రభుత్వ వైద్యశాలకు చేరుకొని కన్నీరు మున్నీరుగా విలపించారు.

ఐదు రోజుల పాటు ఉదయ్ ఎక్స్‌ప్రెస్ రద్దు

గుంటూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సీటీర్ వర్కులు కారణంగా ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌ని ఐదు రోజుల పాటు రద్దు చేస్తున్నట్లు సీపీటీఎం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 22876 గుంటూరు - విశాఖపట్టణం, 22875 విశాఖపట్టణం - గుంటూరు ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌ని ఆగస్టు 26వ తేదీ నుంచి 30వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఏషియన్ పోటీలకు స్కేటర్ జెస్సీరాజ్



మంగళగిరి సిటీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కొరియాలో ఈ నెల 24 నుంచి పది రోజులపాటు జరగనున్న ఏషియన్ చాంపియన్‌షిప్ స్కే టింగ్ పోటీలకు మంగళగిరికి చెందిన అంతర్జాతీయ స్కేటర్ మాత్రపు జెస్సీరాజ్ ఎంపికైంది. భారత జట్టు తరఫున ఎంపికైన 29 మం ది సభ్యుల బృందంతో కలిసి మంగళవారం దక్షిణ కొరియా తరలివెళ్లింది. క్యాడెట్ గర్ల్స్ విభాగంలో ఏపీ నుంచి పాల్గొనే ఏకైక క్రీడాకారిణి జెస్సీరాజ్ మాత్రమే.

పూణే గోవింద్ డెయిరీని సందర్శించిన సంగం బృందం



ధూళిపాళ్ల నరేంద్రకు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలుకుతున్న పూణేలోని గోవింద్ డెయిరీ యాజమాన్యం

పొన్నూరుటౌన్, జూలై23(ఆంధ్రజ్యోతి): పూణేలోని గోవిందు డెయిరీ అవలంబిస్తున్న పశు వైద్య చికిత్సలను అధ్యయనం చేసి స్థానిక రైతులకు మెరుగైన పశు వైద్యం అందించేలా ప్రణాళికలు రూపొందించుకుంటున్నట్లు సంగం డెయిరీ ఛైర్మన్ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ తెలిపారు. బుధవారం మహారాష్ట్ర పూణేలోని గోవింద్ డెయిరీని సంగం బృందం సందర్శించింది. అక్కడి రైతులు అవలంబిస్తున్న పశు వైద్య చికిత్సలో పాటిస్తున్న ఆయుర్వేద పద్దతులు, లూస్ హౌసింగ్ వంటి ప్రక్రియలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గోవింద్ డెయిరీ ఛైర్మన్ సంజీవ్ రాజే నాయక్, డెయిరీ అవలంబిస్తున్న సాంకేతిక వనరులు సౌకర్యాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీఈఓ పర్వతనేని అనిల్, పశు వైద్య బృందం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఏఎన్‌యూ ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష

● పీజీ ప్రవేశాల సంచాలకులు ఆచార్య బ్రహ్మజీరావు

పెదకాకాని, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి బీటెక్,ఎంటెక్ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రాంలో సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్,కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్ కోర్సులలో సెల్ఫ్ సపోర్ట్ కేటగిరి సీట్ల భర్తీకి బుధవారం నిర్వహించిన ఏఎన్‌యూ ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష విజయవంతంగా ముగిసిందని పీజీ ప్రవేశాల సంచాలకులు ఆచార్య పీ బ్రహ్మజీరావు బుధవారం తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షకు 114 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, 86 మంది హాజరయ్యారన్నారు. ఫలితాలను త్వరలో విడుదల చేస్తామన్నారు. ఆయా కోర్సులలోని సెల్ఫ్ సపోర్టింగ్ కేటగిరి సీట్లలో ప్రవేశం పొందిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ఫీజు రీయింబర్స్‌మెంట్ రాదని ఆయన వివరించారు.

విద్యుత్ షాక్‌తో కౌలు రైతు మృతి



మృతుడు నరసింహారావు

రెంటచింతల, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ షాక్‌తో కౌలు రైతు మృతి చెందిన సంఘటన బుధవారం రెంటచింతల నుంచి మిట్టగుడిపాడు వెళ్లే రహదారిలో ఏడుమంగళం వాగు ఒడ్డున సంభవించింది. ఎస్‌ఐ సీహెచ్ నాగార్జున తెలిపిన వివరాలిలా వున్నాయి. మంచికల్లు గ్రామానికి చెందిన బొమ్మనబోయిన నరసింహారావు(42) రెంటచింతల పరిసరాల్లో 30 ఎకరాలను కౌలుకు తీసుకుని సేద్యం ప్రారంభించారు. మాగాణి పొలానికి వెళ్లి బోర్ మోటార్‌ను స్టార్ట్ చేసే క్రమంలో చేయి ప్యానల్ బాక్స్‌కు తగిలి షాక్‌తో అక్కడికక్కడే ప్రాణాలిడిచారు. మృతునికి భార్య, ముగ్గురు సంతానం. భార్య నాగ లీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని గురజాల ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు చెప్పారు.

శబరి ఎక్స్‌ప్రెస్‌కు గుంటూరులో 10 నిమిషాల హాల్ట్

గుంటూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): శబరి ఎక్స్‌ప్రెస్‌కు ఇప్పటివరకు గుంటూరు రైల్వే జంక్షన్‌లో ఒక నిమిషం మాత్రమే హాల్టింగ్ సమయం ఉండగా సెప్టెంబరు 29వ తేదీ నుంచి అది 10 నిమిషాలకు పెరగబోతున్నది. దీని వలన ఆ రైలులోకి ప్రయాణికులు బోర్డింగ్/అన్‌బోర్డింగ్ చేయడం సులభతరం అవుతుంది. పైగా ఇక్కడే వాటరింగ్ కూడా పెట్టనుండటంతో టాయ్‌లెట్స్, వాష్‌బేసిన్‌లలో నీటి సమస్యలు కూడా తొలగిపోతాయి. తిరువనంతపురం - సికింద్రాబాద్ శబరి ఎక్స్‌ప్రెస్ ప్రస్తుతం గుంటూరుకు ఉదయం 6.29కి వచ్చి 6.30కి బయలుదేరుతున్నది. దీనివలన ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పైన ప్రకటించిన తేదీ నుంచి ఈ రైలు గుంటూరుకు ఉదయం 6.05కి వచ్చి 6.15కి బయలుదేరుతుంది. ఈ కారణంగా సత్తెనపల్లికి 6.54కి, పిడుగురాళ్లకు 7.19కి, నడికుడికి 7.39కి, సికింద్రాబాద్‌కి 11 గంటలకు చేరుకొంటుంది. అలానే సికింద్రాబాద్ - తిరువనంతపురం శబరి ఎక్స్‌ప్రెస్ మారనున్న షెడ్యూల్ ప్రకారం సాయంత్రం 4.59కి నడికుడి, 5.19కి పిడుగురాళ్ల, 5.49కి సత్తెనపల్లి, 6.35కి గుంటూరుకు వచ్చి 6.45కి బయలుదేరుతుంది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే హెడ్‌క్వార్టర్స్ నుంచి అధికారిక సమాచారం బుధవారం డివిజన్ ఆఫీసులకు చేరింది.

మట్టి పరీక్షలు.. 38.72 శాతమే

(5వ పేజీ తరువాయి)

తెలుసుకునే అవకాశం ఉంటుంది. అయితే పరీక్షలే పూర్తి కాకపోవడంతో సాగు పరిస్థితి తారుమారవుతోంది. పొలంలో పంటలు బాగా పండాలంటే నేల ఆరోగ్యంగా ఉండాలి. భూమిలో సరైన పోషకాలు ఉన్నాయా.. లోపాలు ఉన్నాయా అనేది పరీక్షల ద్వారా నిర్ధారిస్తారు. ఈ మేరకు ఎంత మోతాదులో ఎరువులు వాడాలో రైతులకు సూచిస్తారు. ఇంతటి ప్రాధాన్యం కలిగిన భూసార పరీక్షలు మొక్కుబడిగా సాగుతుండటంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

గుంటూరు, బాపట్ల కంటే పల్నాడులో పర్వాలేదు..

పల్నాడు జిల్లాలో రోజుకు వంద నుంచి 150 లోపే మట్టి నమూనాల పరీక్షలు చేసే సామర్థ్యం మాత్రమే ల్యాబ్‌కు ఉంది. జిల్లాలో 23,437 మట్టి నమునాల పరీక్షల లక్ష్యం కాగా 23,191 మట్టి నమూనాలను సేకరించారు. 12,005 నమూనాల పరీక్షలు పూర్తయ్యాయి. బాపట్ల, గుంటూరు జిల్లాల కంటే పల్నాడు జిల్లాలోనే పరీక్షల నిర్వహణ మెరుగ్గా ఉంది. బాపట్ల జిల్లాలో లక్ష్యం మేర 22,688 సేకరించి 7785 మట్టి నమూనాలను పరీక్షించారు. గుంటూరు జిల్లాలో 13,862 సేకరించగా 3494 పరీక్షలు పూర్తయ్యాయి. పరీక్షలు ఇలా జరిగితే ఏడాది చివరికి కూడా పూర్తికావని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్‌లో సూక్ష్మ పోషకాల పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే మట్టి పరీక్షలు తేలకపోవడంతో ఆయా సూక్ష్మపోషకాలను రైతులు కోల్పోయే ప్రమాదం ఉంది. సాయిల్ హెల్త్ కార్డుల ఆధారంగా సూక్ష్మపోషకాలను ప్రభుత్వం పంపిణీ చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో భూసార పరీక్షలు ఇప్పటికైనా వేగవంతం చేయాల్సి ఉంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

50,048 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 51,954 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 50,048 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 9,222 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9600	11000
334	9500	13000	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	13300	334	9500	12500
273	----	-----	నెంబరు. 5	10000	13500
341	10000	13500	273	----	----
4884	---	----	341	10000	13600
సూపర్ 10	----	----	4884	10000	12700
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	14000	తేజ	10000	13800
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	12500
బ్యాడిగి	10000	12600	దేవనూరు డీలక్స్	10000	12600
దేవనూరు డీలక్స్	10000	12500	తాలుకాయలు	4500	7000

అరాచకం నుంచి అభివృద్ధి వైపు పరుగులు



● టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారూనాయక్

మాచర్ల రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం అరాచకం నుంచి అభివృద్ధి వైపు పరుగులు పెడుతోందని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం ధారునాయక్ అన్నారు. బుధవారం మండలంలోని విజయపురిసౌత్ లో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో గాడి తప్పిన రాష్ట్రాన్ని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు అభివృద్ధి పథంలోకి తీసుకొచ్చారని కొనియాడారు. మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి సోదరులు మాచర్లలో చేసిన అరాచకాన్ని నియోజకవర్గ ప్రజలు ఇప్పటికీ మరువలేకపోతున్నారన్నారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి నేతృత్వంలో మాచర్ల నియోజకవర్గం ప్రశాంతంగా ఉందన్నారు. మాచర్లలో ప్రజలు ఆస్తులకు, మానప్రాణాలకు కూటమి ప్రభుత్వంలో భరోసా కల్పించామన్నారు. పిన్నెల్లి సోదరులను ప్రజలు మాచర్ల నియోజకవర్గం నుంచి తరిమి కొట్టి స్వేచ్ఛగా బతుకుతున్నారన్నారు. మాచర్లలో అరాచకాలకు పాల్పడిన వైసీపీ శక్తులను వదిలేది లేదని హెచ్చరించారు.

మద్యం దందా వైసీపీని ఖాళీ చేస్తుంది

● నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్ చార్జి డాక్టర్ రామచంద్రారెడ్డి

మాచర్లటౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మద్యం దందా వైసీపీని ఖాళీ చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మాచర్ల నియోజకవర్గ ఇన్ చార్జి డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వారంరోజులుగా రాష్ట్రంలో ప్రజలు గత వైసీపీ హయాంలో జరిగిన మద్యం దందా గురించి చర్చించుకుంటున్నారన్నారు. గత ప్రభుత్వంలో నకిలీ మద్యంతో ఎందరో ప్రాణాలు కోల్పోయారన్నారు. వైసీపీ రానున్న రోజుల్లో రాష్ట్రంలో ఖాళీ అవడం ఖాయమన్నారు. వంగపాటి నాగరాజు, దొడ్డా శ్రీనివాసరావు, కొమ్ము కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే పీ4 లక్ష్యం

● టీడీపీ సీనియర్ నేత యాగంటి

మాచర్లటౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనే పీ4 లక్ష్యమని టీడీపీ సీనియర్ నేత యాగంటి మల్లికార్జునరావు అన్నారు. బుధవారం పట్టణంలోని 15వ వార్డులో నిర్వహించిన పీ4 సమీక్షలో ఆయన మాట్లాడారు. ప్రజలకు ఆర్థికంగా బలోపేతం చేయడమే పీ4 పథకం లక్ష్యమన్నారు. నిరుద్యోగులకు పీ4 పథకం ద్వారా ఉపాధి కల్పించడం, స్వయం ఉపాధి ద్వారా చిన్న వ్యాపారాలు, కుటీర పరిశ్రమలు ఏర్పాటుకు ఆర్థిక సాయం అందుతుందన్నారు. పారిశ్రామికవేత్తలు, వ్యాపారస్తులు పేదవారిని దత్తత తీసుకొని కనీస అవసరాలను తీరుస్తారన్నారు. ఇళ్ల నిర్మాణం, ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ ల ద్వారా ఆర్థిక చేయూత అందుతుందన్నారు. కార్యక్రమంలో బొట్టు కోటేశ్వరరావు, మద్దిగపు వెంకట్రామిరెడ్డి, బండ్ల బ్రహ్మం, సచివాలయ అడ్మిన్ శ్రీలక్ష్మి, పులుసు రఘునాథ రెడ్డి, చందుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ జిల్లా కార్యదర్శులు పుల్లారెడ్డి, ఆదిలక్ష్మిలను సన్మానిస్తున్న నేతలు

స్థానిక ఎన్నికలకు సమాయత్తం చేయాలి

● సీనియర్ నేత మట్టారెడ్డి

రెంటచింతల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికలకు బీజేపీ సమాయత్తమయ్యేలా పార్టీని తీర్చిదిద్దాలని ఆ మేరకు ప్రణాళికలు రూపొందించుకోవాలని సీనియర్ బీజేపీ నేత పాశం మట్టారెడ్డి కోరారు. బుధవారం రెంటచింతలలో బీజేపీ జిల్లా కార్యదర్శులుగా నియమితులైన ఎస్.పుల్లారెడ్డి, గంజెర్ల ఆదిలక్ష్మిలను ఘనంగా సత్కరించారు. గ్రామస్థాయి నుంచి పార్టీని పటిష్టం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నాసరయ్య, ఇగుటూరి రాజశేఖరరెడ్డి, పూర్ణచంద్రరావు,జి.నాసరయ్య, టి.కోటేశ్వరరావు, పి.శ్రీను, నాగిరెడ్డి, సైదారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

9వ వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు

సత్తెనపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 9వ వార్డులో టీడీపీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బలిజేపల్లి సురేష్‌కుమార్, టీడీపీ నాయకులు బుధవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. సంవత్సర కాలంలో టీడీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉల్లం శ్రీనివాసరావు, అచ్యుత రాజు, కోటేశ్వరరావు, అమరేశ్వరరావు, అంజిబాబు, శివ కోటేశ్వరరావు, బాబురావు పాల్గొన్నారు.

ప్రమాదాలు జరగకుండా వాహనాలు నడపాలి

నకరికల్లు, జూలై 23(ఆంధ్రజ్యోతి): పాఠశాల బస్సులను డ్రైవర్లు ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలతో నడపాలని ఎస్ఐ చల్లా సురేష్ ఆదేశించారు. బుధవారం డ్రైవర్లకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

రాజుపాలెం, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుపాలెంలో ఎస్ఎఫ్ఎస్ పాఠశాలలోని విద్యార్థులకు బుధవారం ఎస్సై వేణుగోపాల్ చట్టాలపై అవగాహన కల్పించారు. మండల ప్రజలకు, మహిళలకు, విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎస్సై వేణుగోపాల్ నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, సైబర్ మోసాలు, రోడ్డు ప్రమాదాలు, మహిళలు, బాలబాలికలపై జరిగే నేరాలు తదితర చట్టాలు, శిక్షలు గురించి అవగాహన కల్పించారు. మహిళలకు రక్షణకవచం శక్తియాప్ అని, ప్రతి మహిళ ఫోన్లో శక్తియాప్ ఉండాలన్నారు. బాల్యవివాహాలు, బాల కార్మిక, వెట్టిచాకిరి వ్యవస్థలు, మానవ అక్రమ రవాణా, ఫోక్సో యాక్ట్, మాదకద్రవ్యాల నిషేధంపై డయల్ 100, 112, 1098, 1930, ఈగిల్ సెల్ 1972కి కాల్ చేయాలని చెప్పారు.

సుపరిపాలన చంద్రబాబుతోనే సాధ్యం

క్రోసూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సుపరిపాలన చంద్రబాబుతోనే సాధ్యమని క్రోసూరు మండల టీడీపీ అధ్యక్షుడు మొగల్ జాన్ అన్నారు. బుధవారం పెరికపాడు, గుడిపాడు గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. సమస్యలు తెలుసుకొని ఐటీడీపీ యాప్‌లో నమోదు చేసుకున్నారు. కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు దాచేపల్లి చందు, జనసేన నాయకులు పూర్ణ, గుడిపాడు బాషా, బయ్యవరపు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా సంక్షేమ ఫలాలు



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఇంటింట కూటమి ప్రభుత్వ సంక్షేమ ఫలాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. మండలంలోని బులుసుపాడు గ్రామంలో బుధవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రవీణ్ ఇంటింట తిరుగుతూ ప్రభుత్వ పథకాల గురించి వివరించి కరపత్రాలను అందించారు. రూ.10లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకుడు వెన్నా సాంబశివారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు ఏటుకూరి బ్రహ్మయ్య, మండల నేతలు అర్తిమళ్ల రమేష్, బెల్లంకొండ రామగోపాలరావు, గల్లా బాబూరావు, మద్దినేని కోటేశ్వరరావు, ఘంటా పాపయ్య, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి భాష్యం ఆంజనేయులు, బండి అప్పారావు, కన్నెదార వసంతరావు, ఇరుకులపాటి అబ్బయ్య, నల్లమేకల సాంబశివరావు, గుడిపూడి రాజు, మండల నేతలు దావులూరి గోపీ, మేదరమెట్ల సౌమిన్ చౌదరి, మోదుగుల చంద్రశేఖర్, గంజిమాల విజయబాబు, ఏటుకూరి రత్నకుమార్, భాష్యం జగదీష్, వడ్లమూడి అప్పారావు, బొంతా హనుమంతరావు, శౌరీలు, జనసేన మండల నేతలు ప్రత్తి శౌరీలు, శ్రీపతి శ్రీనివాసరావు, చిన్నం వెంకట నాగేశ్వరరావు, వేమాల సంజీవరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం రూ.30లక్షల వ్యయంతో రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రైతుల పొగాకును పరిశీలించారు. బలుసుపాడులో దివంగత నేత వంగవీటి మోహన్ రంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రవీణ్‌కు టీడీపీ, జనసేన నేతలు ఘన స్వాగతం పలికారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



ఏరియా వైద్యశాలకు ఇన్వర్టర్లను అందించిన ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, జూలై 23(ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశం ఎమ్మెల్యే అధ్యక్షతన జరిగింది. సమావేశంలో కన్నా మాట్లాడుతూ రోగులకు ఎన్ టీఆర్ వైద్యసేవలు కూడా అందించాలన్నారు. నూతన భవనాన్ని వినియోగంలోకి తెచ్చి రోగులకు మరిన్ని సేవలందించాలని డాక్టర్లకు సూచించారు. వైద్యశాలకు అదనపు సౌకర్యాల గురించి ఆస్పత్రి సూపరింటెండెంట్ లక్ష్మణరావు ఎమ్మెల్యేకు వివరించారు. నూతన భవనంలో పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తిచేయాలని ఏపీఎస్ ఎంఐడీసీ అధికారి హనుమంతునాయక్‌కు ఎమ్మెల్యే సూచించారు. గెయిల్ సంస్థ నుంచి వచ్చిన 20 కుర్చీలు, 10 టేబుల్స్, 10 ట్రాలీలు, 10 క్రాస్‌కార్ట్స్, 2 స్ట్రెచ్చర్లను ఎమ్మెల్యే ఆస్పత్రికి అందించారు. దాతల సహకారంతో రెండు ఇన్వర్టర్లను ఆస్పత్రికి అందించారు. గైనకాలజిస్టులు ఇరువురు సమన్వయంతో రోగులకు సేవలందించటంపై దృష్టిపెట్టాలన్నారు. అజెండాలో పొందుపరిచిన అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో డాక్టర్ పోట్ల అరుణకుమారి, జువ్వాజి రామ్మోహనరావు, మారెళ్ళ స్వామి, ఎలినేడి లక్ష్మీతులసీ, శిరిగిరి మణికంఠ, ఇన్ చార్జ్ ఆర్ఎంవో కృష్ణమూర్తి, డాక్టర్లు సుజాత, మునిసిపల్ కమిషనర్ ఆనంద్‌కుమార్, ఆస్పత్రి ఏవో భవానీ, డాక్టర్లు పాల్గొన్నారు.

భవనాల పరిశీలన

పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌ను సంబంధిత మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఈనెల 25వ తేదీన ప్రారంభించనున్న నేపథ్యంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, కూటమి నేతలు గెస్ట్‌హౌస్‌ను పరిశీలించారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అధికారులకు ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు. ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం

సీఎం సహాయనిధి పేదలకు వరం అని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. టీడీపీ ప్రజావేదికలో పలువురికి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు కృషిచేస్తుందన్నారు. నియోజకవర్గానికి చెందిన 87మంది లబ్ధిదారులకు రూ.79.59లక్షల చెక్కులను పంపిణీ చేశారు.



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే కన్నా, బాజీ చౌదరి

● పట్టణంలో 24వ వార్డులో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగులో కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా పాల్గొని ఇంటింటికీ వెళ్ళి ప్రజలతో మాట్లాడి ప్రభుత్వ పథకాలను వివరించారు. కరపత్రాలను నాయకులతో కలిసి పంపిణీ చేశారు. ప్రజల సమస్యలను తెలుసుకుని మైటీడీపీ యాప్‌లో నమోదు చేశారు. వార్డులో సీసీరోడ్డును ప్రారంభించారు. ఆయా కార్యక్రమాలలో టీడీపీ నాయకులు యెలినేడి రామస్వామి, కనుమూరి బాజిచౌదరి, పూజల వెంకటకోటయ్య, చౌటా శ్రీనివాసరావు, మక్కపాటి రామచంద్రరావు, అంచుల నరసింహారావు, బత్తుల నాగేశ్వరరావు, బండారు నాగరాజు, దరువూరి నాగేశ్వరరావు, నూర్‌బాషా జానీబాబు, భావన్నారాయణ, కట్టా శంకరరావు, మస్తాన్ వలి, సయ్యద్‌మాబూ, గుంటూరు ఆశీర్వాదం, ప్రకాష్, కార్తీక్, కే శ్రీనివాసరావు, జింకా లోకేశ్వరరావు, కోమటినేని శోభారాణి, కొఠారు సంధ్య, బి.రాజేశ్వరి, ఖాజావళి, డి.శ్రీనివాసరావు, ఎం.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

నందిరాజుపాలెంలో పొలం పిలుస్తోంది..

బెల్లంకొండ, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిరాజుపాలెం గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా క్రోసూరు ఏడీఏ మస్తానమ్మ మాట్లాడుతూ రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించినట్లయితే తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. రైతులను ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాలను అందిస్తుందని తెలిపారు. అనంతరం వరి నారు మడులను పరిశీలించారు. ఏవో అరుణ కుమారి, రైతులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రవీంద్ర రత్నాకర్, డాక్టర్ జయకృష్ణ

పరిసరాల పరిశుభ్రతతో డెంగీ నివారణ

ముప్పాళ్ళ, జూలై 23(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతో డెంగీని నివారించవచ్చని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రవీంద్ర రత్నాకర్ అన్నారు. బుధవారం మండలంలోని గోళ్ళపాడు, ముప్పాళ్ళ గ్రామాలలో డెంగీ నివారణపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటి పరిసరాలలో నీరు నిల్వలేకుండా చూసుకోవాలని తెలిపారు. డాక్టర్ జయకృష్ణ మాట్లాడుతూ తీవ్రమైన జ్వరం, ఒళ్ళు నొప్పులు, ఆకలి లేకపోవడం, చర్మంపై దద్దుర్లు ఉంటే డెంగీ లక్షణాలుగా గుర్తించి వెంటనే చికిత్స తీసుకోవాలన్నా రు. కార్యక్రమంలో సీహెచ్ ఓ దస్తగిరి, డామియేన్ పాల్గొన్నారు.



గ్రోమోర్ షాపులో రికార్డులను తనిఖీ చేస్తున్న ఏడీఏ మస్తానమ్మ తదితరులు

గ్రోమోర్ షాపులో రికార్డుల తనిఖీ

● ఫాం ఓ లేదని 182 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాల నిలిపివేత

బెల్లంకొండ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ క్రాస్ రోడ్డు వద్ద ఉన్న గ్రోమోర్ ఎరువుల షాపును క్రోసూరు ఏడీఏ మస్తానమ్మ తనిఖీ చేశారు. ముందుగా గ్రోమోర్ షాపులో ఉన్న రికార్డుల తనిఖీ చేసి అనంతరం గోడౌన్ లో ఉన్న ఎరువుల నిల్వలను పరిశీలించారు. అందులో ఫాం ఓ ఇంక్లూషన్ లేని 182.59 మెట్రిక్ టన్నుల ఎరువుల నిల్వలను తదుపరి అనుమతి వచ్చేవరకు అమ్మకాలను నిలిపివేశారు. తనిఖీల్లో ఏవో అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

అధైర్య పడొద్దమ్మా.. టీడీపీ అండగా ఉంటుంది

● శిల్పారామం చైర్మన్ మంజులారెడ్డి



శేషగిరిరావు సతీమణి కృష్ణవేణిని పరామర్శిస్తున్న మంజులారెడ్డి

రెంటచింతల, జూలై 23(ఆంధ్రజ్యోతి): అధైర్య పడొద్దమ్మా.. టీడీపీ అండగా ఉంటుందని శిల్పారామం చైర్మన్ చేరెడ్డి మంజులారెడ్డి అన్నారు. ఈనెల 20న పాలువాయిగేట్ గ్రామానికి చెందిన టీడీపీ పోరాటయోధుడు నంబూరి శేషగిరిరావు మృతిచెందిన నేపథ్యంలో ఆయన సతీమణి కృష్ణవేణిని బుధవారం మంజులారెడ్డి పరామర్శించారు. తొలుత శేషగిరిరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మే 13, 2024న పోలింగ్ రోజున తనతో పాటు శేషగిరిరావు తీవ్రంగా గాయపడినా అరాచకవాదులకు ఎదురొడ్డి నిలబడ్డారని ఆమె గుర్తుచేశారు. ఈమె వెంట రెంటాల మాజీ సర్పంచ్ బి.సుంకయ్య, ఆర్య వైశ్య నేత కొత్త అంజి, పాలువాయి గేట్ టీడీపీ నేతలున్నారు.

నాగార్జున శిల్ప కళాశాల అభివృద్ధికి కృషి

దుర్గి, జూలై 23(ఆంధ్రజ్యోతి): నాగార్జున శిల్ప కళాశాల అభివృద్ధికి కృషిచేస్తానని చేరెడ్డి మంజులారెడ్డి అన్నారు. దుర్గిలోని నాగార్జున శిల్ప కళాశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా దుర్గి నాగార్జున శిల్ప కళాశాలకు గుర్తింపు ఉందన్నారు. నిర్వాహకుడు చెన్నుపాటి శ్రీనివాసాచారి ఆమెకు శిల్పాన్ని జ్ఞాపికగా అందించారు.

సంక్షేమం, అభివృద్ధి కూటమికి రెండు కళ్లు



కరపత్రాలను పంపిణీ చేస్తున్న గౌతమ్‌రెడ్డి

దుర్గి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ, అభివృద్ధి కూటమి ప్రభుత్వానికి రెండు కళ్ల లాంటివని టీడీపీ యువనేత జూలకంటి గౌతమ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని నిదానంపాడు, రాజానగర్, ఓబులేశునిపల్లె గ్రామాల్లో నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం లో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలుంటే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జూలకంటి అక్కిరెడ్డి, వజ్రంనాయక్, గోగుల వెంకట్రామిరెడ్డి, యాగంటి నరేష్, పసుమర్తి బుజ్జి, దుర్గెంపూడి జానకిరామయ్య, మాగులూరి నారయ్య, మేకల దాసు, దిగుమర్తి సుబ్బారావు, ఉన్నం మహేష్, సి.ఆదినారాయణ, ఎస్.నరసింహారావు, జక్కా రమేష్, కూటమినేతలు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు పరామర్శ

మాచర్ల రూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని అలుగురాజుపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త అవిశెట్టి శ్రీను ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశాల మేరకు ఆయన తనయుడు గౌతమ్‌రెడ్డి, టీడీపీ యువనేత అక్కిరెడ్డిలు శ్రీనును పరామర్శించి ధైర్యంగా ఉండాలని భరోసానిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామియాదవ్, మేకల వెంకటేశ్వర్లు, రామిశెట్టి వెంకటేశ్వర్లు, తన్నీరు అంజి పాల్గొన్నారు.

డయాలసిస్ విభాగంలో మరో 3 బెడ్స్ ఏర్పాటు

● డీసీహెచ్ ఎస్ డాక్టర్ ప్రసూన



మాట్లాడుతున్న డీసీహెచ్ ఎస్ డాక్టర్ ప్రసూన

మాచర్లటౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ ఆరోగ్య పట్ల శ్రద్ధ వహించాలని డీసీహెచ్ ఎస్ డాక్టర్ ఎం ప్రసూన అన్నారు. బుధవారం ఆమె పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ప్రజలు తమ అనారోగ్యానికి ప్రారంభదశలోనే చికిత్స తీసుకోవాలన్నారు. రోగం ముదిరే వరకు నిర్లక్ష్యం చేయవద్దన్నారు. ప్రభుత్వ వైద్యశాలలోని డయాలసిస్ విభాగంలో ప్రస్తుతం ఉన్న 7 బెడ్స్‌కు అదనంగా మరో 3 బెడ్స్ త్వరలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. రోగులకు మెరుగైన వైద్య సహాయం అందించేందుకు రక్త నిల్వ కేంద్రాన్ని ఏర్పాటుచేస్తామన్నారు. కాన్పునకు వచ్చే మహిళలను ముందుగానే వైద్యశాలల్లో చేర్చుకొని నొప్పులు రాగానే డెలివరీ చేసేలా వారికి వైద్యశాలలోనే వసతి కల్పించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే రోగులకు సిటీ స్కాన్ కూడా ఉచితంగా చేసేందుకు ప్రైవేటు డయాగ్నసిస్ సెంటర్లతో చర్చించి ఎంవోయూ చేసుకుంటామన్నారు. ఆధార్‌కార్డు, ఆరోగ్యశ్రీ కార్డులతో వస్తే వారికి ఆయుష్మాన్ భారత్ కార్డులు ఇస్తారన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్డు వలన ప్రజలు దేశ వ్యాప్తంగా వైద్యసహాయం పొందవచ్చన్నారు. డయాలసిస్ విభాగాన్ని నిర్వహించే అపోలో సంస్థ రాష్ట్ర మేనేజర్ మధుకిరణ్ మాట్లాడుతూ డయాలసిస్ యూనిట్స్ ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటామన్నారు. సమావేశంలో వైద్యులు కేపీ చారి, లావణ్య, సౌజన్య, దేవి సౌమ్య పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

సత్తెనపల్లి, జూలై 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్‌ను బుధవారం సహాయ వ్యవసాయ సంచాలకులు బీ రవిబాబు తనిఖీ చేశారు. పట్టణ, మండలంలోని ఎరువుల దుకాణాల్లో ఉన్న నిల్వల వివరాలను తెలిపారు. పీఏసీఎస్‌ల వద్ద, ప్రైవేట్ ఎరువుల దుకాణాల నుంచి రైతులు యూరియా, డీఏపీ, పొటాష్, కాంప్లెక్స్ ఎరువులు పొందవచ్చన్నారు. ఏవో సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

చంద్రమౌళీశ్వరునికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం



ప్రత్యేక అలంకరణలో మరకతలింగ చంద్రమౌళేశ్వర స్వామి



శాకంబరి అలంకారంలో గంగా అన్నపూర్ణాదేవి

నకరికల్లు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం మాసశివరాత్రి సందర్భంగా బుధవారం నరసింగపాడులోని అయ్యప్ప సహిత గంగా అన్నపూర్ణా సమేత మరకత లింగ చంద్రమౌళేశ్వర స్వామి దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి రుద్రహోమం, చండీ హోమం నిర్వహించారు. అమ్మవారికి జరిగిన కుంకుమార్చనల్లో మహిళలు పాల్గొన్నారు. గంగా అన్నపూర్ణాదేవిని శాకంబరిదేవిగా అలంకరించారు. మరకతలింగ చంద్రమౌళేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. పూజా కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త శ్రీనివాసశర్మ పర్యవేక్షించారు.

సంక్షిప్తం...

● దాచేపల్లి, జూలై 23(ఆంధ్రజ్యోతి): రామాపురం రోడ్డులో రోడ్డు మార్జిన్ లో ముందు టైర్లు దిగబడటంతో స్కూల్ బస్సు ఆగిపోయింది. దీంతో ప్రమాదం తప్పినట్టయింది. ప్రైవేటు పాఠశాలల బస్సులపై రవాణా శాఖ అధికారుల పర్యవేక్షణ, నిఘా పెంచాల్సిన అవసరం ఉందని తల్లిదండ్రులు కోరుతున్నారు.

● పిడుగురాళ్ల: రైతులు వాతావరణానికి అనుగుణంగా పంటల సాగును ప్రారంభించాలని ఏఓ సంధ్యారాణి తెలిపారు. బుధవారం జూలకల్లు, పందిటివారిపాలెం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పలు పంటలను పరిశీలించి రైతుసేవా కేంద్రంలో రైతులతో సమావేశమయ్యారు. ఉద్యాన అధికారి ఎం.అంజలిబాయి, వ్యవసాయ సహాయకులు స్వరూప, వంశీ పాల్గొన్నారు.

● సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమాన్ని గ్రామ, వార్డులలో పార్టీ శ్రేణులు నిర్వహిస్తున్నాయి. పట్టణంలోని 2, 3, 4 వార్డులలో పార్టీ నాయకులు జొన్నలగడ్డ శ్రీను, విష్ణు, ప్రసాద్, వలి, యడవల్లి కొండలు, వెంకటరావు, శ్రీను తదితరులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. పందిటివారిపాలెంలో మండల పార్టీ కన్వీనర్ గండికోట వెంకటేశ్వర్లు, యడ్లపల్లి శివ, మేకల మస్తాన్ తదితరులు నిర్వహించారు.

● మాచవరం: మండలంలోని పంచాయతీ కార్యాలయాల్లో బుధవారం పీ - 4 విధానంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాల్లో అన్ని పంచాయతీల కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

● ప్రస్తుత వర్షాలకు నీరు కలుషితమవుతుందని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పంచాయతీల కార్యదర్శులు, ఏఎన్ ఎంలు పారిశుధ్య కార్యక్రమాలను పర్యవేక్షించాలని డిప్యూటీ ఎంపీడీవో వెంగళరావు ఆదేశించారు. బుధవారం మండలంలోని వేమవరం, పిన్నెల్లి, మాచవరం తదితర గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలను పర్యవేక్షించారు. వీధులన్నీ పరిశుభ్రంగా ఉంచాలన్నారు.

● నకరికల్లు: ప్రతి రైతు వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాన్ని ఉపయోగించుకోవాలని ఏవో కే దేవదాసు కోరారు. బుధవారం నకరికల్లు, శివాపురం తండా గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఏఏ వై ప్రభాకర్, రైతులు పాల్గొన్నారు.

● చేజర్లలో తాగునీటి పైపులన్నీ మురుగుకాలువల్లో ఉన్నాయని, కొత్త పైపులైన్ లను ఏర్పాటుచేసి తాగునీరందించాలని సత్తెనపల్లి డీఈ, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ శ్రీనివాస్‌ను గ్రామస్తులు కోరారు. బుధవారం గ్రామంలోని పైపులైన్ లను, జలజీవన్ మిషన్ పనులను అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అధికారులను కోరారు.

● ముప్పాళ్ల: వరివిత్తనాలలో రకాలు, పంటకాలంలో ఆశించే తెగుళ్ళపై లాంఫాం శాస్త్రవేత్త నగేష్ రైతులకు అవగాహన కల్పించారు. బుధవారం మండలంలోని బొల్లవరంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు వరిసాగుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ శ్రీదర్‌రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి బీవీ నారాయణ పాల్గొన్నారు

● సత్తెనపల్లి: పంజాబ్ రాష్ట్రం జలంధర్‌లో ఇటీవల జరిగిన 54వ జాతీయ వాలీబాల్ అండర్ 17 బాలికల పోటీలలో సత్తెనపల్లి పీఎంశ్రీ కేంద్రియ విద్యాలయం బాలికల జట్టు రన్నర్‌గా నిలిచింది. బుధవారం విద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పీఈటీ బీ కిరణ్‌రెడ్డి మాట్లాడుతూ హైదరాబాదులో జరిగిన సెలక్షన్ క్యాంపులో కూడా తమ పాఠశాల బాలికలు నలుగురు జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జగదీష్ కుమార్ గుప్త పాల్గొన్నారు.

● మండలంలోని లక్కరాజు గార్లపాడులో ఉన్న పంచముఖ పట్టాభిరామ స్వామి దేవస్థానం, కొమెరపూడిలోని శ్రీ ఆనంద్ ఈశ్వరస్వామి దేవస్థానంకు రూ.2 కోట్ల సీజీఎఫ్ నిధులు విడుదలైనట్లు ఈఓ ఎస్ కోటిరెడ్డి బుధవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల పెద్దలు, ఈఓ కోటిరెడ్డి ఎమ్మెల్యే కన్నాను కలిసి సన్మానించారు. కార్యక్రమంలో కనుమూరి బాజిచౌదరి, ఆళ్ళ అమరేశ్వరరావు, యర్ర హనుమంతురావు, నూర్‌బాషా జానీబాబు, దరువూరి నాగేశ్వరరావు తదితరులున్నారు.

● బెల్లంకొండ: మండలంలో వర్షాలు లేక రైతులు పంటపొలాల్లో విత్తిన పత్తి విత్తనాలు సక్రమంగా మొలవక ఆందోళన చెందారు. గత మూడు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు రైతులు పంట పొలాల్లో విత్తనాలు వేశారు. గతంలో వేసిన విత్తనాలు కూడా వర్షాలకు ఊపిరి పోసుకోవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మాగాణుల్లో దుక్కులు దున్నుకొని నారు మడులు సిద్ధం చేసుకుంటున్నారు.

● అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 16.05 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 800 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద లీకుల ద్వారా 400 క్యూసెక్కులు దిగువ కృష్ణకు విడుదలవుతోంది.

● క్రోసూరు: భారీ వర్షాల నేపథ్యంలో పత్తి, మాగాణి పంటల్లో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో ఈ వేణుగోపాల్ అన్నారు. వీసపాడులో జరిగిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆయన పత్తి పొలాలను పరిశీలించారు. మాగాణి పంటలో విత్తనశుద్ధి జరిపి నారుమడుల్లో చల్లుకోవాలన్నారు. వీఆర్‌వో రామచంద్రరరావు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

● మాచర్లటౌన్ : మాచర్లలో కూలీల ఆటో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో 8 మంది కూలీలకు గాయాలయ్యాయి. మాచర్లకి చెందిన కూలీలు బుధవారం ఆటోలో రెంటచింతల మండలం మంచికల్లు గ్రామంలో వ్యవసాయ పనులకు వెళ్లి తిరిగి వస్తుండగా శివప్రియనగర్ వద్ద ఆటో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ సంఘటనలో 8మందికి గాయాలయ్యాయి. వీరిని మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పట్టణ పోలీసులు క్షతగాత్రుల నుంచి వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

● రెంటచింతల: రెంటచింతలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో కె.లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మిర్చికి రూ.360, పత్తికి రూ.80 బీమా పథకం కింద ఈ నెలాఖరులోగా చెల్లించాలన్నారు. కందికి రూ.40, వరికి రూ.80 ఆగస్టు 15 లోగా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఈవో రాంబాబునాయక్, ఉద్యాన, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

● మాచర్ల రూరల్: తాళ్లపల్లిలో బుధవారం సర్పంచ్ జూకూరి వెంకట్రామయ్య ఆధ్వర్యాన పీ4 గ్రామసభ నిర్వహించారు. పీ4లో సర్వేలో గుర్తించిన బంగారు కుటుంబాల అర్హతలను గుర్తించారు. సమావేశంలో ఎంపీడీవో ఫణికుమార్ నాయక్, కార్యదర్శి షరీఫ్, డేరంగుల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

● మండలంలోని కొత్తపల్లిలో బుధవారం ఏవో పాపకుమారి ఆధ్వర్యాన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో పాపకుమారి గ్రామంలోని పత్తి పంట పొలాలను సందర్శించి రైతులు తమ పంటలకు బీమా చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ఎం మార్కొండేయులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

● కారంపూడి: మండలంలోని ఒప్పిచర్ల జడ్పీహైస్కూల్‌లో బుధవారం స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్రలో భాగంగా మొక్కల పంపిణీజరిగింది. కార్యక్రమంలో ఎంఈవో-2 రవికుమార్, కె.అప్పారావు, పి.కోటేశ్వరరావు, శ్రీవెంకటేశ్వర చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు వి.హనుమంతురావు, హెచ్ ఎం శౌరిబాబు పాల్గొన్నారు.

పెదమద్దూరు వాగు చప్టా పరిశీలన

అమరావతి, జూలై 23(ఆంధ్రజ్యోతి): అమరావతి విజయవాడ రహదారిలోని పెదమద్దూరులోని వాగుపై శిధిలావస్థకు చేరిన చప్టాను బుధవారం ఎంపీడీవో పార్వతి, పరిశీలించారు. వాగులో అధికంగా వరదనీరు ప్రవహించడంతో ఈ చప్టా మీదుగా వాహనాల రాకపోకలను మంగళవారం నిలిపివేశారు. చప్టాను పరిశీలించిన ఎంపీడీవో అక్కడ కాపలాగా ఉన్న పోలీసు, రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేసి ప్రమాదాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాగు ఉధృతి పెరిగితే మండల అధికారులకు వెంటనే సమాచారం అందించాలని ఆదేశించారు. స్థానిక టీడీపీనాయకులు పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలి

● తహసీల్దార్ నాగరాజు

క్రోసూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్లు తప్పనిసరిగా సమయపాలన పాటించి రేషన్ సరుకులను వినియోగదారులకు అందించాలని, అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ వి.వెంకటనాగరాజు అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన రేషన్ డీలర్ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. 1వ తేదీ నుంచి 15వరకు ఉదయం, సాయంత్రం నిర్ణీత సమయాల్లో అందుబాటులో ఉండాలన్నారు. షాపులకు రాలేని వారికి 5వ తేదీలోగా వారి గృహాలకు వెళ్ళి సరుకులను అందించాలన్నారు. స్టాక్ రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో డీటీ శ్రీనివాసరావు, సీఎస్ డీటీ పాల్గొన్నారు.



వర్షా కాలం వచ్చిందంటే చాలు తరచూ ఏదో ఒక చోట పిడుగులు పడుతూ ఉంటాయి. వాటి తీవ్రతకు ప్రజలు. మూగ జీవాలు ప్రాణాలు కోల్పోవటం జరుగుతుంటుంది. ఈ ప్రమాదం నుంచి బయట పడటానికి, పిడుగు పాటును ముందుగా గుర్తించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న సాంకేతికతతో యాప్ అందుబాటులోకి తెచ్చింది. ఆ యాప్ అపాయాన్ని ముందుగానే గుర్తించి మనల్ని అప్రమత్తం చేస్తుంది.

సత్తెనపల్లి మండలం లక్కరాజు గార్లపాడులో ఇటీవల పిడుగు పడి ఇంటి గోడలు పగుళ్ళు ఇచ్చాయి. ఐతే ఇంటిలో వారికి ఎటువంటి ప్రమాదం జరగ లేదు. పిడుగు శబ్దానికి ఆ ఇంట్లోని సామాగ్రి పాడవ్వటంతో పాటు భయాందోళనలకు గురయ్యారు.

పిడుగును పసిగట్టే దామిని

● దామిని యాప్ అందుబాటులోకి..

వాతావరణానికి సంబదించిన వివరాలు తెలుసుకోవటానికి కేంద్ర యర్త్ సైన్సెస్ మంత్రిత్వ శాఖ ప్రజలకు ఉయోగ పడేలా దామిని యాప్‌ను అందుబాటులోకి తీసుకు వచ్చింది. దీనిని గుగూల్ ప్లే స్టోర్ ఉంచి డౌన్ లోడు చేసుకొని పేరు, మొబైల్ నెంబరుతో రిజిస్టర్ చేసుకోవాలి. జీపీఎస్ లోకేషన్ తెలుసుకోవటం కోసం యాప్‌కు అనుమతి ఇవ్వాలి. దీంతో మీరు ఉన్న ప్రాంతంలో పిడుగు పడే అవకాశం ఉందో లేదో ముందుగానే తెలుసుకోవచ్చు. ఈ యాప్‌లో అన్ని బాషలు అందుబాటులో ఉన్నాయి.

సత్తెనపల్లి (ఆంధ్రజ్యోతి):

జాగ్రత్తలు తీసుకోవాలి

పిడుగు పడితే తీసుకోవాల్సిన జాగ్రత్తలు యాప్‌లో తెలియ జేస్తున్నారు. ఆరు బయట ఉంటే ఇళ్ళల్లోకి వెళ్ళాలి. వర్షం కురుస్తున్న సమయంలో చాలా మంది చెట్ల కిందకు వెళ్తుంటారు. ఇది చాలా ప్రమాదకరం. చెట్టు పిడుగును త్వరగా ఆకర్షిస్తుంది. వర్షం పడేటప్పుడు చెట్టు కిందకు ఎట్టి పరిస్థితుల్లోను వెళ్ళకూడదు. మెరుపులు అధికంగా ఉంటే ఇంటి నుంచి బయటకు వెళ్ళక పోవటం ఉత్తమం. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతున్న సమయంలో ఎలక్ట్రానిక్ వస్తువులు ఉపయోగించకపోవటం మేలని నిపుణులు పేర్కొంటున్నారు.



పండుగలు వస్తున్నాయ్..

శ్రావణంలో అనేక పండుగలు వస్తున్నాయి. ఈనెల 25న తొలి శుక్రవారం, 8న వరలక్ష్మీ వ్రతం, 9న రాఖీ, జంధ్యాల పౌర్ణమి వేడుకలు, 15న స్వాతంత్రదినోత్సవం, 16న శ్రీకృష్ణాష్టమి వంటి ముఖ్యమైన పండుగలు ఉన్నాయి. 22న ఐదో శుక్రవారంతో శ్రావణ మాసం ముగుస్తుంది. శ్రావణం పూర్తైన వెంటనే బాద్రపద మాసంలో 27న వినాయక చవితి పండుగ వస్తుంది.

శుభాల.. శ్రావణం

- రేపటి నుంచి శ్రావణమాసం ప్రారంభం
- పండుగలకు 'నెల'వు..
- మహిళలకు ప్రీతిపాత్రం
- వ్యాపారులు, రైతులు, పురోహితుల్లో ఆశలు
- దేవాలయాలూ ముస్తాబు

నెలల వారీగా ముహూర్తాలు

జూలైలో : 26, 30, 31
ఆగస్టు : 1, 3, 5, 7, 8, 9, 10, 11, 12, 13, 14, 17.
సెప్టెంబరు : 24, 26, 27, 28.
అక్టోబరు : 1, 2, 3, 4, 8, 10, 11, 12, 22, 24, 29, 30, 31.
నవంబరు : 1, 2, 7, 8, 12, 13, 15. 22, 23, 26, 27, 28, 30

● నవంబరు నెల్లో కూడా ముహూర్తాలు రికార్డు స్థాయిలో ఉన్నాయని అనంతరం. డిసెంబరు 8 నుంచి ఫిబ్రవరి 6 తేది వరకు దాదాపు రెండు నెలలపాటు ముహూర్తాలు లేవని పండితులు చెబుతున్నారు.

గుంటూరు (తూర్పు), జూలై 23(ఆంధ్రజ్యోతి): మే నెలతో ముహూర్తాలు ముగియడంతో వివాహాలు, శుభకార్యాలకు విరామం వచ్చింది. శ్రావణ మాసం ఆరంభం నుంచి శుభ ముహూర్తాలు ఉండటంతో పట్టణాలతో పాటు పల్లెల్లోనూ కల్యాణ మండపాలను సిద్ధం చేస్తున్నారు. వివాహాలతో పాటు గృహ ప్రవేశాలకు బలమైన ముహూర్తాలు ఉన్నట్టు వేద పండితులు చెబుతున్నారు. మరో వైపు ఈ మాసం మహిళలకు ఎంతో ప్రీతిపాత్రమైంది. ధార్మిక, ఆధ్యాత్మిక, వ్యాపార ప్రారంభం వంటి శుభకార్యాలతో ముడిపడి ఉంటుంది. వివాహం, గృహ ప్రవేశం, గృహ నిర్మాణం, నామకరణం వంటి అనేక శుభ కార్యాలు నిర్వహించటానికి మంచి నెలగా అందరూ భావిస్తారు. కొత్త దంపతులు ఆషాడంలో ఎడబాటు కు గురవు తారు. శ్రావణంలో కలుస్తారు.

విష్ణు పూజలకు ప్రత్యేకం..

శ్రావణ మాసం ప్రారంభం కానుండటంతో మహిళలు శ్రావణ లక్ష్మీవ్రతాలను ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. సర్వమంగళ కారియైన గౌరి, లక్ష్మి, హరిహరులను విశేషంగా అర్చించే నెల కూడా ఇదే. చాంద్రమానం ప్రకారం శ్రావణాన్ని ఐదో నెలగా పరిగణిస్తారు. ఈనెల పౌర్ణమిన చంద్రుడు శ్రవణ నక్షత్ర సమీపంలో సంచరిస్తున్నందున శ్రావణ మాసంఅనే పేరు వచ్చినట్లు పండితులు చెబుతారు. శ్రవణ నక్షత్రం మహావిష్ణువు జన్మ నక్షత్రం కావటంతో విష్ణు పూజలకు ప్రసిద్ధి. ఈ నెలలో వచ్చే మంగళ, శుక్ర, శనివారాలను అత్యంత పుణ్యప్రదమైనవిగా భావిస్తారు. మంగళవారం గౌరీ పూజలు, శుక్రవారాల్లో లక్ష్మీపూజలు, శనివారాల్లో విష్ణు పూజలు చేస్తారు. వైష్ణవారాధనతో పాటు మహా శివునికి పెద్ద ఎత్తున రుద్రాభిషేకాలు నిర్వహిస్తారు.

వ్యాపారుల్లో ఆశలు...

ముఖ్యంగా ఈనెల 31న పెద్ద ముహూర్తం కావడంతో పెళ్లిళ్ల పెద్ద సంఖ్యలో జరగనున్నాయి. దీంతో అయా వ్యాపారులు, పురోహితులు ఈ ముహూర్తంపై ఆశలు పెట్టుకున్నారు. ఇదే సమయంలో శ్రావణ మాసంపై రైతులు పెద్ద ఆశలే పెట్టుకున్నారు. ముఖ్యంగా దరలేక నష్టపోతున్న మిర్చి, పొగాకు రైతులు ఈ నెలలో నైనా దర పెరుగుతుందని ఆశగా ఎదురుచూస్తున్నారు.



● శ్రావణ మాసం ప్రత్యేకమైంది...

శ్రావణమాసం అంటే ఎంతో పవిత్రమైనదిగా, ప్రధానమైనదిగా భావిస్తారు. జ్ఞానసిద్ధిని అందించే మాసంగా పురాణాల్లో పేర్కొన్నారు. వైష్ణవా రాధనతో పాటు మహా శివునికి పెద్ద ఎత్తున రుద్రాభిషేకాలు నిర్వహిస్తారు. ముఖ్యంగా వివాహాది శుభకార్యాలకు శ్రావణమాసంలో మంచి ముహూర్తాలు ఉన్నాయి.



మాధవస్వామి
గుంటూరు బృందావన్‌గార్డెన్స్,వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకుడు



● పెసర్లంక వద్ద వరద ఉధృతికి కోతకు గురవుతున్న పంట పొలాలు

నదీపాతంలో పొలాలు

- భూమి కోతలతో రైతులకు గుండెకోత
- తీర పొలాల రక్షణకు గ్రాయిన్స్ ఏర్పాటు చేయాలని వినతి

కొల్లూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కృష్ణమ్మ ఉధృతికి తీర ప్రాంత పొలాలు నదీపాతంలో కలిసిపోతున్నాయి. కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో చిలుమూరు నుంచి రావిఅనంతవరం వరకు సుమారు 30 కి.మీ పైగా కృష్ణానది పరివాహక ప్రాంతంలో వందలాది ఎకరాల పంట భూములు వరదల వల్ల కోతకు గురవుతున్నాయి. గత సంవత్సరం కృష్ణానదికి వచ్చిన భారీ వరదకు అంచున ఉన్న భూములు నదిలో కలిసిపోయాయి. 30 ఏళ్ల క్రితం కొల్లూరు మండలంలో పోతార్లంక, తిప్పలకట్ట గ్రామాల మధ్యలో భూమి కోతలు నివారించేందుకు గ్రాయిన్స్(గోడలు) నిర్మించి నదీ ప్రవాహాన్ని దారి మళ్లించడంతో కొంత మేరకు కోతలు తగ్గాయి. కొన్నేళ్ల నుంచి భట్టిప్రోలు మండలం ఓలేరు, కొల్లూరు మండలంలోని పెసర్లంక, పోతార్లంక, తిప్పలకట్ట గ్రామాల పరిధిలో భూమి కోతకు గురవుతోంది. వరద ప్రవాహం పెరిగేటప్పుడు తగ్గేటప్పుడు భూమి కోతలు ఎక్కువగా ఉంటున్నాయి. భూమి ఎక్కువగా కోతకు గురయ్యే ప్రాంతాల్లో నది పరివాహక శాఖాధికారులు గుర్తించి గ్రాయిన్స్ ఏర్పాటు చేస్తే ప్రవాహం దిశ మారుతుందని రైతులు చెప్తున్నారు. ప్రజా ప్రతినిధులు ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని గ్రాయిన్స్ ఏర్పాటు చేసి రైతులకు మేలు చేయాలని లంక గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఇంజనీరింగ్ సీట్ల జాబితా విడుదల

- 26 లోపు రిపోర్టు చేయాలని ఉత్తర్వులు
- ఉమ్మడి జిల్లాలో 30 వేలకు పైగా ఇంజనీరింగ్ సీట్లు

గుంటూరు (విద్య) జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని ఇంజనీరింగ్ కళాశాలలో ప్రవేశం కోసం నిర్వహించిన వెబ్ కౌన్సెలింగ్ ఆప్షన్ పెట్టుకున్న విద్యార్థిని విద్యార్థులకు సీట్లు కేటాయిస్తూ సాంకేతిక విద్యాశాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. విద్యార్థిని ,విద్యార్థులు నిర్దేశించిన తేదీల్లో సీట్లు కేటాయించిన కళాశాలలో రిపోర్టు చేయాలని సాంకేతిక విద్యాశాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది.

సీట్లు కేటాయింపు తెలుసుకునేది ఇలా..

విద్యార్థిని విద్యార్థులు తమకు ఏ ఇంజనీరింగ్ కళాశాలలో సీటు వచ్చింది అనే విషయాలు తెలుసుకునేందుకు వెబ్సైట్‌లో చూడాలి . ఏపీ ఈఏపీ సెట్ హోం పేజీలో పారమ్స్ అనే బాక్స్ లో డౌన్లోడ్ అలాట్మెంట్ ఆర్డర్ పై క్లిక్ చేస్తే వివరాలు తెలుస్తాయి. అక్కడ హాల్ టికెట్ నంబర్ పుట్టిన తేదీ వివరాలు నమోదు చేస్తే ఓటీపీ వస్తుంది దానిని ఎంటర్ చేసిన వెంటనే అలాట్మెంట్ ఆర్డర్ సెల్ఫ్ రిపోర్టింగ్ ,వెబ్ ఆప్షన్ రిపోర్టింగ్ డోస్ట్ అవుతాయి. ఇక్కడ ఏ కళాశాలలో సీటు వచ్చిందో దానికి సంబంధించిన అలాట్మెంట్ ఆర్డర్ ను డౌన్లోడ్ చేసుకోవచ్చినని సాంకేతిక విద్యాశాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది.

వెరిఫికేషన్‌కు అవసరమైన పత్రాలు ఇవే..

ఇంజనీరింగ్ కళాశాలలో సీట్లు వచ్చిన విద్యార్థిని విద్యార్థులు ఈనెల 26న రిపోర్ట్ చేయాలి. ఈ నేపథ్యంలో విద్యార్థులు కళాశాలకు వెళ్లే సమయంలో ఆన్లైన్ కౌన్సెలింగ్ స్లిప్పు , ఏపీ ఏపీ సెట్ ర్యాంక్ కార్డ్, అడ్మిట్ కార్డ్, పదవ తరగతి సర్టిఫికెట్, ఇంటర్ మార్కుల జాబితా, ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్ ,ఆదాయ ధ్రువీకరణ పత్రం, నివాస ధ్రువీకరణ పత్రం, కుల, ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణ పత్రాలు ఒరిజినల్ కాపీల సెట్లు తీసుకు వెళ్లాల్సి ఉంటుంది. జిరాక్స్ కాపీలను కళాశాలలో అందజేసి రిపోర్ట్ చేయాలి. ఇంజనీరింగ్ విద్యార్థులకు ఆగస్టు 4 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని సాంకేతిక విద్యాశాఖ వెల్లడించింది.



జిల్లాలో పరిస్థితి ఏమిటి

ఉమ్మడి జిల్లాలో రెండు యూనివర్సిటీ కాలేజీ లతోపాటు మరో 36 పైగా ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో దాదాపు 30వేలకు పైగా సీట్లు ఉన్నాయి. అయితే అయితే ఏపీ ఏపీ సెట్‌లో అర్హత సాధించిన విద్యార్థుల విద్యార్థులు 25 వేల మంది వరకు ఉన్నారు.

మిర్చి.. మోత

కిలో రూ. 100, టమోటా రూ. 60



గుంటూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): మార్కెట్లో పచ్చిమిర్చి ధర చెబితేనే ఘాటెక్కుతోంది. మరో వైపు టమోటా ధరలు కూడా మోత మోగుతున్నాయి. టమోటా కిలో రూ. 60కు చేరుకుంది. ఇటీవల వర్షాలు విస్తారంగా కురవటం, డిమాండ్‌కు అనుగుణంగా పంట ఉత్పత్తులు లేకపోవటంతో టమోటా, మిర్చి ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా వ్యాపారులు విశ్లేషిస్తున్నారు. పచ్చి మిర్చి గత రెండు వారాల కింద రూ. 50 నుంచి రూ. 60ల నుంచి ఎగబాకుతూ ప్రస్తుతం రూ. 100లకు చేరుకుంది. గత వారంలో టమోటా కిలో రూ. 40లు ఉండగా రోజురోజుకు పెరుగుతూ తాజాగా కిలో రూ. 60లకు చేరింది. సోమ, మంగళవారాలు కూడా టమోటా కిలో రూ. 40లు, రూ. 50లకు విక్రయించగా ఒక్క రోజులోనే కిలోకు రూ.10లకు పెరిగింది. ఇక బెండ, దొండ, గోరు చిక్కుడు, వంకాయ వంటి కూరగాయలు కిలో రూ. 40 నుంచి రూ. 50ల వరకు విక్రయిస్తున్నారు.

సబ్ డివిజన్ సర్వీసులకు ఫీజు రాయితీ

డిసెంబరు 12 వరకు పొడిగించిన ప్రభుత్వం

గుంటూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జాయింట్ ల్యాండ్ పార్శిల్ మ్యాప్‌ల ఆన్‌లైన్ సబ్ డివిజన్ సర్వీసుల కోసం అందిన దరఖాస్తులకు వన్‌టైం ఫీజు రాయితీని ప్రభుత్వం మరికొన్ని నెలలు పొడిగించింది. ఈ ఏడాది డిసెంబరు 31వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు బుధవారం ప్రకటించింది. ఈ ఏడాది జనవరి ఒకటో తేదీన వన్‌టైం ఫీజు రాయితీని ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చింది. అయితే ఇంకా చాలామంది ఈ రాయితీని వినియోగించుకొనేందుకు అభ్యర్థనలు పెట్టుకోవడంతో గడువు తేదీని పొడిగిస్తూ సీసీఎల్‌ఏ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జీ జయలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు.

భూముల రీసర్వేలో భాగంగా గత ప్రభుత్వం ఎల్‌పీఎంలను తీసుకొచ్చింది. వీటి వలన భూముల సర్వే నంబర్లు కనుమరుగై వాటి స్థానంలో ఎల్‌పీఎంలు వచ్చాయి. వీటి ఆధారంగానే రిజిస్ట్రేషన్లు కూడా చేస్తున్నారు. అయితే జాయింట్ ఎల్‌పీఎంల వలనే అనేక భూవివాదాలు నెలకొన్నాయి. వాటిని సింగిల్ ఎల్‌పీఎంలుగా చేయాలని రైతుల నుంచి రెవెన్యూ సదస్సుల సందర్భంగా వేల సంఖ్యలో అభ్యర్థనలు వచ్చాయి. గుంటూరు జిల్లాలో 3036, పల్నాడు జిల్లాలో 3378, బాపట్ల జిల్లాలో 4253 అర్జీలు వచ్చాయి. వీటిల్లో ఎక్కువగా జాయింట్ ఎల్‌పీఎంలవే ఉన్నాయి. తమకు ఉచితంగా సింగిల్ ఎల్‌పీఎం ఇవ్వాలని రైతులు ప్రభుత్వాన్ని అభ్యర్థించగా అందుకు ఆమోదం తెలిపి, ఆరు నెలల పాటు ఉచితంగా అవకాశం కల్పించింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు రూ. 550 ఫీజు నిర్ణయించడంతో రైతులు ఇబ్బంది పడగా ప్రభుత్వం దానిని వన్‌టైం రాయితీ కింద మినహాయించింది. రీసర్వే పూర్తి అయిన గ్రామాల్లో జాయింట్ ఎల్‌పీఎంలపై స్వీకరించిన దరఖాస్తులను పూర్తి పరిశీలన చేసి ఆన్‌లైన్ సబ్‌డివిజన్‌ని ఉచితంగా చేస్తున్నారు.


ప్రభుత్వం ఇచ్చిన తొలి ఆరు నెలల గడువు ఆయా ఆన్‌లైన్ దరఖాస్తుల పరిష్కారానికి సరిపోకపోవడంతో రైతుల విజ్ఞప్తి మేరకు మరో ఆరు నెలలు పొడిగిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. దీనిపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో అధికారులు త్వరితగతిన ఆన్‌లైన్ సబ్ డివిజన్‌కు సంబంధించిన జాయింట్ ఎల్‌పీఎం అర్జీలను పరిష్కరించాలని కోరుతున్నారు.

దివ్యాంగులకు వాహనయోగం

- ఉచితంగా ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం
- తొలిదశలో నియోజకవర్గానికి పది చొప్పున పంపిణీ
- త్వరలోనే దరఖాస్తుల స్వీకరణ

గుంటూరు(తూర్పు), జూలై 23 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ఇంధన రాయితీ, శాశ్వత గుర్తింపు కార్డులు అందజేసిన కూటమి ప్రభుత్వం మరో తీపి కబురు అందించింది. వారికి నూరు శాతం రాయితీతో త్రిచక్ర వాహనాలు (రెట్రోఫిటెడ్ వాహనాలు) అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ త్వరలోనే ప్రారంభమవుతుందని అధికారులు చెబుతున్నారు. అర్హుల జాబితాను తయారు చేసి వీలైనంత వేగంగా వాహనాలు అందజేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. గతంలోనే 50 శాతం ఇందన రాయితీ కల్పించిన ప్రభుత్వం మరోసారి రూ లక్ష విలువ కలిగిన వాహనాలను అందజేయడంపై దివ్యాంగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం ఈ వాహనాలు అందజేసింది. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీనిని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఐదేళ్ల కాలంలో ఒక్కసారే పంపిణీ చేశారు.

● ఆనందంగా ఉంది..



ఎన్నికల హామీలో భాగంగా పెన్షన్ పెంచడం, ఆ తరువాత ఇందన రాయితీ, ఇప్పుడు లక్ష రూపాయిలు విలువ చేసే వాహనాలను అందించడం ఆనందంగా ఉంది. ఇటువంటి కార్యక్రమాలతో దివ్యాంగులకు స్వయం ఉపాధిని కొనసాగించడానికి, వారికి జీవన నాణ్యతను మెరుగుపరిచేందుకు శక్తి నిస్తుంది. ప్రభుత్వం స్పందించి అధికారంలోకి రాగానే ఈ కార్యక్రమాన్ని పునరుద్ధరించడం అభినందనీయం. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి వాహనం అందించేలా కార్యచరణ రూపొందించాలి.

వెలుగు శివప్రసాదు, విభిన్న ప్రతిభా వంతుల ఆదరణ సేవ సమితి అధ్యక్షుడు



● సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వం తీసుకు వస్తున్న ఈ కార్యక్రమాన్ని దివ్యాంగులు సద్వియోగం చేసుకోవాలి. దీనికి సంబంధించిన నిధులును ప్రభుత్వం కేటాయించింది. త్వరలోనే దరఖాస్తుల స్వీకరణ ప్రారంభిస్తాం. కావాల్సిన పత్రాలు ఇతర వివరాలను అందజేసేందుకు సిబ్బందిని అందుబాటులో ఉంచాం. ప్రభుత్వ ఆదేశాలు అందగానే దరఖాస్తులు స్వీకరించి, ప్రభుత్వానికి పంపుతాం. అర్హుల జాబితాను ఎంపికచేసి, వీలైనంత త్వరలోనే వాహనాలను పంపిణీ చేస్తాం.

దుర్గాబాయి, ఇన్‌చార్జి ఏడీ వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ జిల్లా శాఖ.

అర్హులు ఎవరంటే..

త్రిచక్ర వాహనాల పంపిణీకి దివ్యాంగుల అర్హతలను ఇప్పటికే ప్రభుత్వం నిర్ధారించింది. డిగ్రీ, ఆపై ఉన్నతవిద్య అభ్యసించే విద్యార్థులకు, స్వయం ఉపాధి రంగంలో ఉన్నవారికి తొలి ప్రాధాన్యమిస్తారు. 18-45 ఏళ్ల మధ్య ఉన్న 70 శాతం అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్నవారు దీనికి అర్హులు. వార్షికాదాయం రూ. 3లక్షల లోపు ఉండాలి.

కావాల్సిన పత్రాలు

దరఖాస్తుతో పాటు వైకల్యం 70శాతం నిర్ధారించే సదరన్ సర్టిఫికెట్, డ్రైవింగ్ లైసెన్స్, పదవ తరగతి సర్టిఫికెట్, బ్యాంకు వివరాలు, ఆధార్, రేషన్ కార్డులు, వ్యాపారం లేదా ఏదైనా సంస్థలో పనిచేస్తున్నట్టు ధృవీకరణ పత్రంతో అయా జిల్లాలోని వయోవృద్ధులు, హిజ్రాల, దివ్యాంగుల సంక్షేమ కార్యాలయంలో సమర్పించాలి.

● నియోజకవర్గానికి పది వాహనాలు

తొలిదశలో నియోజకవర్గానికి 10 చొప్పున వాహనాలు అందజేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. దీనిని ప్రతి ఏడాది నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటుంది. స్వచ్ఛంద సంస్థల ద్వారా మరి కొంత మందికి వీటిని అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. దీంతో ప్రతి లబ్ధిదారునికి వాహనం అందుతుందని అధికారులు చెబుతున్నారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి: ఎంపీడీవో ఉమాదేవి

నూజెండ్ల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపినట్టు ఎంపీడీవో పీ ఉమాదేవి అన్నారు. మండలంలోని కొత్తజెడ్డావారిపాలెం, పాత జెడ్డావారిపాలెం, పెద్దవరం గ్రామాల్లో ఎంపీడీవో పీ ఉమాదేవి, డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణలు పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు క్రమం తప్పకుండా క్లాప్ మిత్రలకు తగు సూచనలు చేస్తూ గృహాల నుంచి చెత్త సేకరణ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రామ కృష్ణ, రాంబాబు ఉన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

మస్టర్ కార్యాలయంలో కమిషనర్ ఆకస్మిక తనిఖీ

నర్సరావుపేట రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కమిషనర్ జస్వంతరావు రెండో డివిజన్ మస్టర్ కార్యాలయాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీచేసి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. తడిచెత్త, పొడి చెత్త, టీస్టాల్ వద్ద టీ కప్పుల నిర్వహణ డస్ట్‌బిన్‌ల వినియోగం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు.

రైతులు సాగుహక్కు పత్రాలను పొందాలి: ఏవో

రొంపిచర్ల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు సాగుహక్కు పత్రాలను పొందాలని ఏవో శివలలిత బుధవారం తెలిపారు. మండలంలోని గోగులపాడు, కొనకంచివారిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో నల్లబర్లీ పొగాకును సాగు చేయవద్దని పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవలో రైతులకు ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఐ ద్వితీయ జిల్లా మహా సభలను జయప్రదం చేయాలి

రొంపిచర్ల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సీపీఐ జిల్లా ద్వితీయ మహా సభలను జయప్రదం చేయాలని మండల కేంద్రమైన రొంపిచర్లలో వాల్‌పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఆగస్టు 7, 8 తేదీల్లో వినుకొండలో ఈ మహా సభలు జరుగుతాయని సీపీఐ ఏరియా కార్యదర్శి చక్రవరం సత్యనారాయణ రాజు తెలిపారు. కార్యక్రమంలో రొడ్డా అంజిరెడ్డి, జమ్మలమూడి వెంకటేశ్వర్లు, పిడెం హుస్సేన్, ముప్పూరి మధుసూదనరావు, కాసా ప్రసాదు, శ్రీను పాల్గొన్నారు.

ఎన్ఈసీలో ఎన్‌సీసీ విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ

నరసరావుపేట రూరల్, జూలై 23, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్ఈసీ కళాశాలలో ఎన్‌సీసీలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సర్టిఫికెట్లను పంపిణీ చేసినట్లు ఎన్‌సీసీ అధికారి రాజేష్‌బాబు బుధవారం తెలిపారు తమ కళాశాల నుంచి 33మంది హాజరయ్యారని 33మంది ఉత్తీర్ణులయ్యారని ఆయన తెలిపారు.

ఎరువుల వాడకం తగ్గించండి

ఈపూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగలూరు, గుండేపల్లి గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయాధికారులు రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి సునీత, నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఘన సత్కారం

యడ్లపాడు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండవీడులోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో బదిలీ అయిన ఉపాధ్యాయులను బుధవారం ఘనంగా సత్కరించారు. హెచ్ఎం గోరంట్ల శ్రీనివాసరావు, తెలుగు పండిట్ జి.నరేంద్రకుమార్, జె కవిత, ఎస్టీటీ సమతను గ్రామపెద్దలు పెద్దన్న, వెంకట్రావు, హుస్సేన్, అంగన్‌వాడీ కార్యకర్తలు ఘనంగా సత్కరించారు.

ఇన్‌చార్జి ఏపీవోగా ఆంజనేయరాజు బాధ్యతల స్వీకరణ

శావల్యాపురం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం ఇన్‌చార్జి ఏపీవోగా ఆంజనేయరాజు ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య సమక్షంలో బుధవారం బాధ్యతలను స్వీకరించారు. నూజెండ్ల మండలం ఏపీవోగా విధులు నిర్వహిస్తున్న ఆంజనేయరాజుకు శావల్యాపురం మండలానికి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ డ్వామా పీడీ ఉత్తర్వులు జారీచేసినట్లు ఎంపీడీవో తెలిపారు. ఇక్కడ ఏపీవో విధులు నిర్వహించిన రామారావు జూన్ 30న ఉద్యోగ విరమణ చేయడంతో ఖాళీ ఏర్పడిందన్నారు.

ఇన్‌చార్జి ఏపీఎంగా రామాంజనేయులు...

శావల్యాపురం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో వెలుగు ఇన్‌చార్జి ఏపీఎంగా రామాంజనేయులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ప్రస్తుతం వినుకొండ ఏపీఎంగా విధులను నిర్వహిస్తూ అదనపు బాధ్యతలపై శావల్యాపురానికి వచ్చారు. ఇప్పటివరకు ఏపీఎంగా విధులు నిర్వహించిన గుమ్మడిల్లి వాసుబాబు నర్సరావుపేటలోని జిల్లా సమాఖ్య కార్యాలయానికి బదిలీ కావడంతో ఖాళీ ఏర్పడింది.

పొదుపుపై అవగాహన

నాదెండ్ల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సంపాదించిన సొమ్మును పొదుపు చేయటం ద్వారానే ఆర్థికాభివృద్ధి సాధించగలుగుతారని సాతులూరు కెనరా బ్యాంక్ చీఫ్ మేనేజర్ మేనేజర్ మారుతీ శ్రీనివాసులు అన్నారు. గ్రామంలోని సచివాలయ సమావేశ మందిరంలో భారతీ రిజర్వ్‌బ్యాంక్ సౌజన్యంతో ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో పొదుపుపై ఖాతాదారులను చైతన్యపరుస్తూ అవగాహన బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో సర్పంచ్ ఎం.శోభారాణి, సంస్థ డైరెక్టర్ కే సాల్మన్ పాల్, సాతులూరు బ్రాంచ్ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

● ప్రధాన వీధిలో చేతులకు అందే ఎత్తులో ఉన్న వైర్లు

● అధికారులు పట్టించుకోలేదని గ్రామస్థుల ఆరోపణ



కొత్తలూరులో చేతికందే ఎత్తులో వేలాడుతున్న విద్యుత్ తీగలు, పూరింటిపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలు

కొత్తలూరు (శావల్యాపురం) జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తలూరులో విద్యుత్ తీగలు చాలా తక్కువ ఎత్తులో ఉండడంతో ప్రమాదకరంగా ఉన్నాయి. కొత్తలూరు నుంచి తుమ్మలకుంట వెళ్ళే దారిలో ప్రధాన వీధిలో గతంలో ఎన్నో ఏళ్ళ క్రితం విద్యుత్ స్తంభాలువేసి విద్యుత్ తీగలు బిగించారు. కాలక్రమేణా తీగలు లూజు కావడంతో పాటు ఆ మార్గంలో రోడ్డు ఎత్తులేపి సీసీ రోడ్డు నిర్మాణం చేయడంతో విద్యుత్‌తీగలు తక్కువ ఎత్తులోకి వచ్చాయి. చిన్నారులు, మహిళలు, గ్రామస్థులు నడిచేప్పుడు అవి చేతులకు తగిలేలా ఉండడం, అదేమార్గంలో పూరింటిపై విద్యుత్‌తీగలు వేలాడుతుండడంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి ఈపూరు మండలానికి వెళ్లేందుకు రోజూ వందలాది వాహనాలపై ప్రజలు ఈమార్గంలో ప్రయాణిస్తుంటారు. ఈపూరు నుంచి నార్కెట్‌పల్లి హైవే ఎక్కేందుకు పెద్ద వాహనాలు కూడా ఈమార్గంలో వెళుతుంటాయి. సమస్యను స్థానిక విద్యుత్‌శాఖ అధికారులకు పలుమార్లు చెప్పినా వారు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

హామీలను అమలుచేస్తున్న కూటమి ప్రభుత్వం

● దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



నరసరావుపేటలో జరిగిన తొలి అడుగు కార్యక్రమంలో పర్యటిస్తున్న మంత్రి ఆనం, ఎమ్మెల్యే చదలవాడ

నరరావుపేట టౌన్ , జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలుచేస్తోందని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. బుధవారం నరసరావుపేట పట్టణంలోని 27, 28 వార్డులలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ వైసీపీ దుర్మార్గపాలన అంతంచేసి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా, పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా, ప్రధానిగా నరేంద్రమోడీ ఆశీస్సులతో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. వైసీపీ పాలనను 94శాతం ఓటురేటుతో ప్రజలు తిరస్కరించారన్నారు. కూటమి ప్రభుత్వ సూపర్‌సిక్స్ పథకాలలో భాగమే ఎన్‌టీర్ భరోసా ఒకేసారి వేయి రూపాయలు పెంచి, నాలుగువేలు చేసి, మూడు మాసాల పాత బకాయిని కూడా కలిపి తొలి మాసమే రూ.7 వేలు ఇచ్చామన్నారు. తర్వాత తల్లికి వందనంలో ఎందరు బిడ్డలు ఉన్నా అందరికీ పథకాన్ని వర్తింపచేశామన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ఆగస్టు 15నుంచి అమలు చేయబోతున్నామని చెప్పారు. అన్ని కార్యక్రమాలు చేసిన తర్వాత ప్రజలు మనసు తెలుసుకోవడానికి సుపరిపాలన తొలి అడుగుగా పర్యటిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, రంగిశెట్టి రామకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, కపలవాయి విజయకుమార్, కొల్లి బ్రహ్మయ్య కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



దాసరిపాలెంలో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అరవిందబాబు

● రొంపిచర్ల: రాష్ట్రాభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. మండలంలోని దాసరిపాలెంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి సంక్షేమ పథకాలపై కరపత్రాలను పంపిణీచేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. గ్రామంలో మృతిచెందిన అంజయ్య భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

● ఈపూరు: పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు కూటమి ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తోందని పల్నాడు జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు అన్నారు. మండల కేంద్రమైన ఈపూరులో బుధవారం సాయంత్రం సుపరిపాలన తొలిఅడుగు ఇంటింటి కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జగ్గారావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇచ్చే రాయితీ రుణాలను రద్దుచేసి వారిని ఆర్థికంగా నష్టపరిచిందన్నారు. కార్యక్రమంలో మద్దం నాగలక్ష్మయ్య, మీసాల చిన్న ప్రసాదు, మద్దం గోవిందు, బొల్లా సుబ్బారావు,కోటేశ్వరరావు,మురళి,శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వరనాయక్



శావల్యాపురంలో చెత్తతొట్లను పరిశీలిస్తున్న డీపీవో నాగేశ్వర నాయక్

శావల్యాపురం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యంపై అలసత్వం వహిస్తే కఠినచర్యలు తప్పవని డీపీవో నాగేశ్వరనాయక్ హెచ్చరించారు. పారిశుధ్యంపై ప్రభుత్వం చేపట్టిన ఐవీఆర్ఎస్ కాల్స్‌లో తక్కువశాతం నమోదైన శావల్యాపురం, బొందిలిపాలెం గ్రామాలను డీపీవో బుధవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. బొందిలిపాలెంలో ఇంటింటికీ చెత్తసేకరణ జరుగుతున్న తీరును, శావల్యాపురంలో చెత్తసేకరణ కేంద్రం, ఘనవ్యర్థాల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలిచ్చారు. డీపీవో మాట్లాడుతూ జిల్లాలో 526 పంచాయతీలుండగా వాటిలో 256 పంచాయతీలను ప్రభుత్వం ఐవీఆర్ఎస్ కాల్స్ కింద ఎంపిక చేసిందన్నారు. ప్రతిరోజూ ఐవీఆర్ఎస్ కాల్స్‌పై పర్యవేక్షణ జరుగుతుందని, కాల్స్‌లో తక్కువ నమోదైన పంచాయతీలను ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నామన్నారు. క్లాప్‌మిత్రలు ఇళ్ళలోని తడిచెత్త, పొడిచెత్తలను వేర్వేరుగా సేకరించి చెత్తసేకరణ కేంద్రాలకు తరలించి చెత్త తొట్లలో వేసి ఘనవ్యర్థాల నిర్వహణ చేయాలన్నారు. అవసరాన్ని బట్టి క్లాప్‌మిత్రల సంఖ్యను పెంచాలని, వారికి వేతనాన్ని కూడా పెంచి చెత్తసేకరణ సజావుగా జరిగేలా చూడాలన్నారు. పారిశుధ్యంపై డ్వాక్రా సంఘాల మహిళలకు, పాఠశాల విద్యార్థులకు పంచాయతీ కార్యదర్శులు విస్తృతస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లోని ప్రజలకు మైకులు, కరపత్రాల ద్వారా ప్రచారం చేయాలన్నారు. ప్రధానమంత్రి ఆదర్శ గ్రామోజన పథకానికి సంబంధించి ఎంపికచేసిన గ్రామాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ప్రోత్సాహకాలతో గ్రామాల్లో అన్ని మౌలిక వసతులను కల్పించి అభివృద్ధిపథంలో తీర్చిదిద్దవచ్చన్నారు. గ్రామ సచివాలయాల్లో సిబ్బంది కొరత వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మండల కేంద్రంలో కూడా సిబ్బంది కొరత ఉండడంతో ప్రజల సేవలు సక్రమంగా అందక వెనుదిరగాల్సి వస్తోందని విలేకరులు డీపీవోకి తెలుపగా త్వరలో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సుగుణ, పంచాయతీ కార్యదర్శులు యాకోబు, అరుణ పాల్గొన్నారు.

రేమిడిచర్లలో పారిశుధ్య పనుల పరిశీలన

బొల్లాపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేమిడిచర్లలో బుధవారం నరసరావుపేట డీఎల్‌పీవో వీవీఎం లక్ష్మణరావు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చెత్త సేకరణ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని, గ్రామాల్లో పారిశుధ్య పనులను మెరుగుపరచాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఇన్ చార్జ్ ఈవోపీఆర్డీ కుంటా వాసుబాబు, పంచాయతీ కార్యదర్శులు దాసరి వంశీ కృష్ణ, శ్రీనివాసరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ఆషాఢపట్టీ సమర్పణ





శాకంబరి దేవి అలంకరణతో వాసవికన్యకాపరమేశ్వరి అమ్మవారు, కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

వినుకొండ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బోసుబొమ్మ సెంటర్‌లోని కన్యకాపరమేశ్వరి అమ్మవారికి సదావర్తి సంఘం ఆధ్వర్యంలో ఆషాఢమాసం పట్టీ సమర్పించే కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని శాకంబరిదేవి అలంకరణ చేయడంతో పాటు, అనంతరం రంగనాయకస్వామి దేవస్థానం నుంచి ఆర్యవైశ్య సదావర్తి సంఘం సభ్యులు, మహిళలు పెద్దసంఖ్యలో కోలాట భజనలతో అమ్మవారి నామస్మరణతో మెయిన్ బజారు గుండా మేళతాళాలతో ఊరేగింపుగా బోసుబొమ్మసెంటర్‌లోని అమ్మవారి దేవస్థానం వద్దకు వచ్చారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు జొన్నలగడ్డ బాబ్జి మాట్లాడుతూ కన్యకాపరమేశ్వరి దేవస్థానం నూతన పాలక వర్గం ఏర్పడిన తరువాత మొట్టమొదటిసారిగా వాసవి అమ్మవారికి ఆషాఢమాసం పట్టీ కార్యక్రమం నిర్వహించినందుకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

కార్యక్రమంలో తాతా సత్యనారాయణ, పెరుమాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి, నగేష్‌బాబు, పెండేల సురేష్, కొల్లిపర నాగేశ్వరరావు, వెంకటకిరణ్‌కుమార్, నాగపవన్‌కుమార్‌తో పాటు ఆర్యవైశ్య సదావర్తి సంఘం సభ్యులు , మహిళాభక్తులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం, కారు ఢీ.. ఒకరికి గాయాలు

కనమర్లపూడి (శావల్యాపురం) జూలై 23 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం, కారు ఎదురెదురుగా ఢీకొట్టడంతో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన గుంటూరు-కర్నూలు జాతీయ రహదారిలో శావల్యాపురం మండలం కనమర్లపూడి సమీపంలో బుధవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు వినుకొండలోని కుమ్మరిపాలేనికి చెందిన పలుకూరి సుబ్బయ్య వ్యక్తిగత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంపై నరసరావుపేటకు వెళ్ళి తిరిగి వస్తున్నాడు. మార్గమధ్యంలో కనమర్లపూడి సమీపంలోని కోల్డ్‌స్టోరేజీ వద్దకు రాగానే వినుకొండ నుంచి నరసరావుపేటవైపునకు వెళుతున్న ఇన్నోవా కారు వేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో ద్విచక్రవాహనంపై ఉన్న సుబ్బయ్య ఎగిరి రోడ్డుపైపడ్డాడు. అతని రెండు కాళ్ళు విరగడంతోపాటు తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు సుబ్బయ్యను అత్యవసర వాహనంలో వినుకొండలోని ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు. సుబ్బయ్య వినుకొండ మండలం చీకటీగలపాలెం మోడల్ పాఠశాలలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. విషయం తెలుసుకొన్న వినుకొండ రూరల్ సీఐ ప్రభాకరరావు, ఎస్ఐ లోకేశ్వరరావు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని రోడ్డు ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి వివరాలు నమోదు చేసుకొన్నారు. కేసును నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లోకేశ్వరరావు తెలిపారు. ఇటీవల మండల పరిధిలో వరుసగా జరిగిన రోడ్డు ప్రమాదాలతో ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. రోడ్డు ప్రమాదాలు అరికట్టేందుకు పటిష్టచర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కారు దహనం కేసులో నిందితుడి అరెస్టు

బొల్లాపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూగచింతలపాలెంలో పెట్రోల్‌పోసి కారును తగలబెట్టిన కేసులో నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్టు బండ్లమోటు ఎస్ఐ ఏ బాలకృష్ణ బుధవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం గత ఏడాది సెప్టెంబరు 20వ తేదీ 2024న మూగచింతలపాలెం గ్రామానికి చెందిన తెలుగు యువత నాయకుడు పోకా వెంకటరావు తన ఇంటి ముందు నిలిపి ఉంచిన కారును దహనం చేశారు. ఈ ఘటనపై విచారణ చేపట్టిన పోలీసులు నిందితుడు అర్ధరాత్రి బొల్లాపల్లిలోని ఓ పెట్రోల్ బంకులో పెట్రోల్ కొనుగోలుచేసి, దాంతో కారును దహనం చేసినట్లు దర్యాప్తులో తేలిందని ఎస్ఐ పేర్కొన్నారు. నిందితుడిని అరెస్టుచేసి కోర్టులో హాజరుపరిచినట్టు బాలకృష్ణ తెలిపారు.

బాల గంగాధర్ తిలక్‌కు ఘన నివాళి

నాదెండ్ల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, లోకమాన్య బాల గంగాధర్ తిలక్ జయంతిని సీఆర్ కళాశాలలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మనోహర్ మాట్లాడుతూ స్వరాజ్యం నా జన్మ హక్కు అని, అది తీసుకోకుండా ఊరుకోను అన్న తిలక్ పదాలు ఇప్పటికీ ప్రతి భారతీయుడికి స్ఫూర్తినిస్తాయన్నారు. ప్రజలను ఐక్యంగా ఉంచేందుకు గాను గణేష్ ఉత్సవాలు, శివాజీ జయంతి లాంటి ఉత్సవాలను ప్రారంభించింది తిలక్ అని వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు, కరస్పాండెంట్ చుండి వేణుగోపాల్, డైరెక్టర్ సీహెచ్ రంగనాయకులు, నిరంజన్ , పీడీ నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సేవలు బహుదూరం

● నమోదుకు 50 కిలో మీటర్లు వెళ్ళాల్సి రావటంతో ఇక్కట్లు

బొల్లాపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆధార్ సేవలు అందుబాటులో లేవు. గతంలో ఉన్న ఆధార్ కేంద్రాన్ని అధికారులు తీసివేశారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆధార్‌లో మార్పులు, చేర్పులు నమోదు చేయాలంటే 50 కిలోమీటర్లలోని వినుకొండకు లేకుంటే 40కిలోమీటర్లలోని కారంపూడికి వెళ్ళాల్సి వస్తోంది. ఇంకా 35కిలోమీటర్ల దూరంలోని ప్రకాశం జిల్లాకు వెళ్ళాల్సిన పరిస్థితి ఉంది. దీంతో వ్యవప్రయాసలకోర్చి ప్రయాణించాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిల్లల నుంచి పెద్దల వరకు దూరప్రాంతాలకు వెళ్లి రోజంతా అక్కడ కూర్చొని ఆధార్ నమోదు చేయించుకోవాల్సి వస్తుండటంపై మహిళలు, వృద్ధులు వాపోతున్నారు. గతంలో బొల్లాపల్లి, వెల్లటూరు, గుమ్మనంపాడు గ్రామాల్లో ఆధార్ కేంద్రాలు పనిచేశాయని, ఇప్పుడు అవి లేకపోవటంతో కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి బొల్లాపల్లిలో ఆధార్ నమోదు కేంద్రాన్ని పునఃప్రారంభించాలని కోరుతున్నారు. ఈ సమస్యను ఎంపీడీవో సీతారామయ్య దృష్టికి తీసుకు వెళ్ళగా సిబ్బంది కొరత ఉండటం వల్ల ఆధార్ కేంద్రాలు పనిచేయటం లేదన్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు.

సాంకేతికత తోడైతే వేగంగా వ్యవసాయరంగ అభివృద్ధి

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సేద్యానికి సాంకేతికత తోడైతే రాష్ట్ర వ్యవసాయరంగం ప్రపంచానికే మార్గదర్శిగా నిలుస్తుందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులు సృష్టిస్తున్న టెక్నాలజీ వినియోగాన్ని వ్యవసాయానికి జోడించాలన్న ముఖ్యమంత్రి ఆలోచనను స్వాగతిస్తున్నట్టు తెలిపారు. పంటల వివరాలపై శాటిలైట్ సర్వే, ఏఐ పరిజ్ఞానం వినియోగించాలన్న ముఖ్యమంత్రి ఆలోచనతో రాష్ట్ర వ్యవసాయరంగం వేగంగా వృద్ధి చెందుతుందన్నారు. ఆధునికతతో కూడిన సేద్యం దిశగా రైతులు అడుగేయాల్సిన సమయమిదని వివరించారు. అర్హులైన ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ సాయం అందాలన్న చంద్రబాబు నిర్ణయాన్ని రైతులు హర్షిస్తున్నారని పేర్కొన్నారు. ఎరువుల కొరత లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించడంతో పాటు రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన దిశగా, భూ సర్వేలోని సమస్యల పరిష్కారానికి నిర్దిష్టమైన కార్యాచరణ అమలు చేయాలన్న ముఖ్యమంత్రి ఆదేశాలతో రైతులు ఎదుర్కొంటున్న సర్వే సమస్యలు వేగంగా పరిష్కారమవుతాయని వివరించారు.

వైభవంగా మాస శివరాత్రి పూజలు



ప్రత్యేక అలంకరణలో విప్పర్లలోని వల్లభేశ్వరస్వామి

రొంపిచర్ల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో మాస శివరాత్రి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. రొంపిచర్లలోని శంకరస్వామి, విప్పర్లలోని వల్లభేశ్వర స్వామి, మాచవరం, పరగటిచర్ల గ్రామాల్లో రామలింగేశ్వర స్వామి, గోగులపాడులోని చంద్రమౌళేశ్వరస్వామి, కొనకంచివారిపాలెంలోని వీరభద్రేశ్వరస్వామి, వడ్లమూడివారిపాలెంలోని నీలకంఠేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలను నిర్వహించారు. పార్వతిదేవి అమ్మవారికి కుంకుమ పూజలు జరిగాయి. ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామివారిని భక్తులు దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.



డ్రెయినేజీలో పూడికతీత పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో వినుకొండ మున్సిపాలిటీకి 9వ ర్యాంక్

వినుకొండ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంక్‌లో వినుకొండ మున్సిపాలిటీ రాష్ట్రస్థాయిలో 9వ ర్యాంక్, జాతీయ స్థాయిలో 301వ ర్యాంక్ సాధించినట్లు మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ తెలిపారు. జాతీయ స్థాయిలో పురపాలక సంఘాలకు నిర్వహించే స్వచ్ఛతా ర్యాంకింగ్స్‌లో ర్యాంక్ సాధించడమే కాక ఓడీఎఫ్ ప్లస్‌ప్లస్ గుర్తింపును వినుకొండ పురపాలక సంఘం సాధించినట్లు కమిషనర్ ఆనందం వ్యక్తంచేశారు. గత సంవత్సరం స్వచ్ఛ సర్వేక్ష 2023 ర్యాంక్‌లో రాష్ట్రస్థాయిలో 43వ ర్యాంక్, జాతీయ స్థాయిలో 1977ర్యాంక్ వచ్చిందన్నారు. ఈ సందర్భంగా మెరుగైన సేవలు అందించిన పురపాలక సంఘం, మున్సిపల్, పబ్లిక్ అండ్ హెల్త్, ఇంజనీరింగ్, ప్లానింగ్ సిబ్బందికి కమిషనర్ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఇదేవిధంగా మున్సిపల్ సిబ్బంది విధుల్లో అంకితభావంతో పనిచేస్తూ వినుకొండ పట్టణ పురోభివృద్ధికి అన్నివిధాలా కృషి చేయాలని కోరారు.

పీహెచ్‌సీలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి తనిఖీ



బొల్లాపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి గీతాంజలి

బొల్లాపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల కేంద్రమైన బొల్లాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి బీ గీతాంజలి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పటల్‌లోని రికార్డులను పరిశీలించి రోగులకు అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. హాస్పటల్‌లో ఓపీ శాతం పెంచాలన్నారు. ఆమె వెంట డాక్టర్ శంకర్ నారాయణ, వైద్య సిబ్బంది ఉన్నారు.

కల్తీ కల్లుపై అప్రమత్తంగా ఉండాలి

● వినుకొండ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు

బొల్లాపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): నాటుసారా, కల్తీ మద్యం, కల్తీకల్లుపై అప్రమత్తంగా ఉండాలని వినుకొండ ఎక్సైజ్ ఇన్ స్పెక్టర్ డీ శ్రీనివాసరావు, ఈపూరు ఎక్సైజ్ ఇన్ స్పెక్టర్ డీ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని గండిగనుమలలో పల్నాడు జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి ఆదేశాల మేరకు వినుకొండ, ఈపూరు ఎక్సైజ్ ఇన్ స్పెక్టర్ల ఆధ్వర్యంలో బొల్లాపల్లి మండలంలోని గండి గనుముల గ్రామంలో అనుమానిత ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. గండి గనుముల గ్రామంలో జాయింట్ రైట్స్‌తో కల్తీ కల్లుపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ నాటుసారా, కల్తీ మద్యం, కల్తీకల్లుపై అప్రమత్తంగా ఉండాలని, యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, నాటుసారా, కల్తీ కల్లు సంబంధం ఉన్న నేరాల గురించి ఎలాంటి సమాచారం ఉన్నా తమ దృష్టికి తీసుకు వస్తే గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది సీహెచ్ వినీల, కే మురళి, ఎస్‌కే మస్తాన్ వలి, పీ హనుమంతరావు, పీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.